Follow: @ANNTELUGU
17-09-2025
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 284 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణా చరిత్రలో సువర్ణాక్షర లిఖితం

### సెప్టెంబర్ 17 ఉద్విగ్న సందర్భం...

**మహా నెట్ వర్క్:** తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 సువర్ణాక్షర లిఖితం. ఉద్విగ్నభరితం. ఈ తేదీ ఎంతో ప్రత్యేకం. తెలంగాణా చరిత్రను మలుపు తిప్పిన రోజు. శతాబ్దాల బానిస సంకెళ్లను తుంచేసిన భావోద్వేగం. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడాది అయినా ఇంకా స్వేచ్ఛ కోసం ఎదురుచూస్తున్న సందర్భంలో చేసిన పోరాటం ఫలించిన క్షణం. రాజరికం పరిసమాప్తమై ప్రజాస్వామ్యం పరిఢవిల్లిన క్షణం. నిజాం కబంద హస్తాల నుంచి విమోచన పొందిన రోజు. నా దేశం భారతదేశం అని గర్వంగా ప్రతీ తెలంగాణా పౌరుడు నినదించిన రోజు.. అందుకే సెప్టెంబర్ 17 ఎలా పిలుచుకున్నా తెలంగాణ ప్రజలకు వెరీ స్పెషల్ డే.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

## టీటీడీ బోర్డు కీలక నిర్ణయాలు



- రాష్ట్రవ్యాప్తంగా 1000 ఆలయాల నిర్మాణానికి బోర్డు అంగీకారం
- టిటిడిపై తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు

02

## తెలంగాణలో పాల కొరత



- అప్రమత్తం కాకుంటే డబ్బాపాలే గతి

02

## లండన్‌లో లోకేష్



- 150 మంది దిగ్గజ సీఈవోలతో భేటీ
- 14 లక్షల కోట్ల విలువ గల కంపెనీల ప్రతినిధులతో చర్చలు

02




# 16,000 మంది విదేశీయులను వెనక్కి పంపనున్న కేంద్రం

### డ్రగ్స్ కేసులో చిక్కిన వారికి కేంద్ర హోంశాఖ షాక్.. మాదకద్రవ్యాల ముఠాలపై కేంద్ర ప్రభుత్వం భారీ చర్యలు



**ఢిల్లీ, మహా :** మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. దేశవ్యాప్తంగా డ్రగ్స్ సంబంధిత కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 16,000 మంది విదేశీ పౌరులను దేశం నుంచి బహిష్కరించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ భారీ బహిష్కరణ ప్రక్రియకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇటీవలి కాలంలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి చేపట్టిన అతిపెద్ద చర్యల్లో ఇది ఒకటిగా నిలవనుంది. డ్రగ్స్ స్మగ్లింగ్ నుంచి రవాణా వరకు వివిధ రకాల నేరారోపణలు ఎదుర్కొంటున్న విదేశీయులను గుర్తించి, వారి జాబితాను ఎన్‌సీబీ సిద్ధం చేసింది. ఈ జాబితాను ఇప్పటికే హోం మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత ఏజెన్సీలకు అందజేసినట్లు సమాచారం. బహిష్కరణకు గురికానున్న వారిలో బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, మయన్మార్, మలేషియా, ఘనా, నైజీరియా వంటి దేశాలకు చెందిన వారు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉన్న డిటెన్షన్ కేంద్రాల్లో అదుపులో ఉన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన వలస చట్టంలోని నిబంధనల ప్రకారం వీరిని వారి సొంత దేశాలకు పంపించే ప్రక్రియను చేపట్టనున్నారు.



## హైదరాబాద్ మెట్రో ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్

- ప్రభుత్వ సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి
- తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

02



# రాష్ట్రంలో కొత్త డిస్కం

### ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌కు తోడు మరొకటి

వ్యవసాయం, ఎత్తిపోతలు, తాగునీటి సరఫరా ఈ డిస్కం పరిధిలోకి..

ఇందన శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

పూర్తిస్థాయి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశం

**జూబ్లీహిల్స్, మహా:** రాష్ట్రంలో మరో డిస్కం ఏర్పాటుకానుంది. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ కు తోడు మరొక డిస్కం ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందన శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష జరిపారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, జెన్ కో సీఎండీ హరీష్, సింగరేణి సీఎండీ బలరాం, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, రెడ్కో చైర్మన్ శరత్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ తో పాటు మరో కొత్త డిస్కం ఏర్పాటు ప్రతిపాదనల నేపథ్యంలో ప్రాథమిక ప్రణాళికను ఇంధన శాఖ సిద్ధం చేసింది. కొత్త డిస్కం ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికను సీఎంకు అధికారులు వివరించారు.

మిగతా 2లో

## అడ్డిమారి గుడ్డిదెబ్బలో గెలిచిన పొంగులేటి

### ..ఈసారి ఎట్లా గెలుస్తారో చూస్తా..

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సవాల్

పోయిన దీపావళికి పొంగులేటి బాంబులు పేలుతాయని చెప్పారు

పొంగులేటి బిజెపితో కుమ్మక్కయ్యారు

తెలుగు వారికి ఎన్టీఆర్ ఎంతో.. తెలంగాణకు కేసీఆర్ అంత



**హైదరాబాద్, మహా:** పోయిన దీపావళికి బాంబులు పేలుతాయని పొంగులేటి చెప్పారు. ఈ దీపావళికి బాంబులు పేలలేదు. పొంగులేటి పెద్ద బిల్డప్. అడ్డిమారి గుడ్డిదెబ్బలో పొంగులేటి గెలిచారు. ఈ సారి పొంగులేటి పాలేరులో ఎట్లా గెలుస్తారో చూస్తా. తంతే గారెల బుట్టలో పడ్డట్లు పొంగులేటికి మంత్రి పదవి వచ్చింది. పొంగులేటి బీజేపీతో కుమ్మక్కు అయ్యారు అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో



## త్వరలో మహిళా పాలసీ

- మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం లోగో ఆవిష్కరణ

02

# పన్నీరు వారి పాల దందా

### హ్యాపీరావు ఘోరాలు.. కవితక్క అప్ డేట్స్ వైరల్

**హైదరాబాద్, మహా :** టైం చెప్పి మరీ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోంది కవిత టీం. అక్రమాల టానిక్..పన్నీరు వారి పాల దందా ముచ్చట అంటూ ఎక్స్ లో స్టోరీ పోస్ట్ షేర్ చేశారు కవితక్క అప్ డేట్స్. అన్నయ్య కలిపిన అనుబంధం టానిక్, దళితుల్ని ముంచిన పాలు అంటూ ట్యాగ్ లైన్ పెట్టారు. నేరెళ్ల నేరాలు..హ్యాపీ రావు ఘోరాలంటూ సెటైర్లు వేశారు. కొంపలో కుంపటి పెట్టిన హ్యాపీ రావు అంటూ సంతోష్ రావును టార్గెట్ చేశారు కవిత. ఆమె పోస్టులు పొలిటికల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలే హరీశ్,సంతోష్ రావులపై తీవ్ర ఆరోపణలు చేసిన కవిత,బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామాచేసిన సంగతి తెలిసిందే.. ఇన్ని రోజులు సైలెంట్ గా ఉన్న కవిత.. ఇపుడు మరోసారి హరీశ్,సంతోష్ లను టార్గెట్ చేయడంపై చర్చనీయాంశంగా మారింది. ఈ




నేతలు సైలెంట్ గా ఉన్న మరోసారి తీవ్ర వ్యాఖ్యలతో కవిత టీం విరుచుకుపడింది.

**కర్నాటకలో హ్యాపీరావు డీల్**

'ఒక స్పెషల్ జీవో తెచ్చుకొని టానిక్ అనే ఒక సంస్థ స్థాపించి వందల కోట్ల కొల్లకొట్టడానికి ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాడు.

మిగతా 2లో



## అవినీతి అనకొండ

- రూ. 300 కోట్ల అక్రమాస్తులు.. విద్యుత్ ఏడీఈ అరెస్ట్
- ఏడీఈ అంబేద్కర్ నివాసంతో పాటు బినామీలు, బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు
- భారీగా నగదు, బంగారం, ఇళ్ల డాక్యుమెంట్లు, వ్యవసాయ భూముల పత్రాలు గుర్తింపు
- బినామీ సతీష్ ఇంట్లో రూ.2 కోట్ల 18 లక్షల రూపాయలు సీజ్ చేసిన అధికారులు

02



## ఆదిలాబాద్‌కు షబ్బీర్ అలీ

ఘనస్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి

05

## మధుయాష్కికి అస్వస్థత

- మంత్రి శ్రీధర్‌బాబు పేషీలో ఉండగా ఛాతి నొప్పి
- ఒక్కసారిగా కూలబడడంతో ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం సాయంత్రం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు పేషీలో ఉండగా. ఛాతి నొప్పి అంటూ ఒక్కసారిగా కూలబడిపోయారు. వెంటనే సచివాలయంలోని డిస్పెన్సరీలో వైద్యం అందించిన సిబ్బంది.. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు.



# తెలంగాణలో పాల కొరత

## అప్రమత్తం కాకుంటే డబ్బాపాలే గతి



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోగా, భవిష్యత్తులో డబ్బా పాలే గతవుతాయా? అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఈ రంగం రోజురోజుకీ క్షీణిస్తుండగా, భవిష్యత్తులో అనేక కొత్త సమస్యలు తలెత్తనున్నాయి. పశు సంపదలో వృద్ధి లేకపోవడం వల్ల పాల ఉత్పత్తి తగ్గుతోంది. తెలంగాణలో రోజుకి సుమారు 26 లక్షల లీటర్ల పాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో ఉత్పత్తవుతున్న పాలు కేవలం 4 లక్షల లీటర్ల వరకు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఇది రాష్ట్ర అవసరాలను తీర్చేందుకు సరిపడే స్థాయిలో లేదు. పాడిపశువుల సంఖ్య తగ్గడం వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఇప్పటికే పాడిరైతులు పోసే పాలు రోజుకి కేవలం 50 వేల లీటర్ల వరకు తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తెలంగాణలో పశుసంపద వృద్ధి చెందడం లేదు. గేదెలు, ఆవుల సంఖ్య తగ్గడంతో పాడి, దాని అనుబంధ ఉత్పత్తులపై ప్రభావం పడింది. దీని వల్ల ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అనివార్యపరిస్థితి నెలకొంది. పాడిసంపద పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు తీసుకోవాల్సి ఉంది.

# త్వరలో మహిళా పాలసీ

## మంత్రులు కొండా సురేఖ, సీతక్క

## మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం లోగో ఆవిష్కరణ



**హైదరాబాద్, మహా:**

సమాజంలో మహిళల పాత్ర కీలకమైనదని రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ అన్నారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు అందించే దిశలో పని చేయాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో జరిగిన తెలంగాణ సెక్రటేరియట్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం లోగో ఆవిష్కరణ, సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభ్యులుగా ఎన్నికైన మహిళ ఉద్యోగులచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళలకు ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ విధి నిర్వహణలో అద్భుతంగా ప్రభుత్వ ఉద్యోగంలో రాణిస్తున్నారని, మహిళకు ఉద్యోగం అంటేనే అదనపు బాధ్యత, ఒకవైపు కుటుంబ బాధ్యతలు మరొకవైపు వృత్తి బాధ్యతలు.. రెండిటిని ఏకకాలంలో నెరవేర్చుతున్న మహిళా ఉద్యోగులను ప్రశంశించారు. కుటుంబ బాధ్యతలు, వృత్తి బాధ్యతల్లో మహిళలు నిత్యం ఒత్తిడిలకు గురువుతున్నారని, వారి ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కూడా చూసుకోవాలన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించేందుకు మహిళ ఉద్యోగులందరితో ఈనెల 22న రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు ఇచ్చే సూచనలు, సలహాల మేరకు ఒక నూతన మహిళా పాలసీని తేవడానికి పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాలు 67 లక్షల మంది మహిళలతో పని చేస్తున్నాయని వివిధ రంగాలలో మహిళా స్వయం సహాయక బృందాలు అద్భుతాలు సృష్టిస్తున్నారని, ఇటీవలనే మహబూబ్ నగర్ జిల్లాలో పెట్రోల్ బంకుల నిర్వహణ ద్వారా కేవలం ఒక నెలలో 13 లక్షల రూపాయలు అర్జించారని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, పథకాలు విజయవంతం కావడానికి ప్రభుత్వ ఉద్యోగుల కృషి కీలకమని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ సెక్రటేరియట్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ లోగోను ఈ సందర్భంగా మంత్రులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమాదేవి, సంఘం సభ్యులు శైలజ, మంగ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ మెట్రో ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్

## ప్రభుత్వ సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా రాజిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. హైదరాబాద్ మెట్రో ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్, హెచ్ ఎండీఏ సెక్రటరీగా కోటా శ్రీవత్స, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా శృతి ఓజా, సోషల్ వెల్ఫేర్ సెక్రటరీగా కృష్ణ ఆదిత్యను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎండీఏ కమిషనర్ గా కొనసాగుతున్న సర్ఫరాజ్ అహ్మద్‌ను మెట్రో ఎండీగా ప్రభుత్వం నియమించడం గమనార్హం. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుతో తీవ్రంగా నష్టపోయిన ఎల్ అండ్ టీ, తన వాటాలను విక్రయించేందుకు రెడీగా ఉన్నామని ప్రకటించిన సమయంలో మెట్రో ఎండీ మార్పు చర్చనీయాంశమైంది. ఎల్ అండ్ టీ తన వాటాలను రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాలని కోరుతోంది. భారీగా నష్టాలు వస్తుండడం, అప్పులు పెరిగిపోతుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త స్పెషల్ పర్పోజ్ వెహికల్ (ఎస్‌పీవీ) ద్వారా ఈ విక్రయం జరగాలని కోరింది. ఇందుకు సంబంధించి మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్‌కు లెటర్ పంపింది.

# తెలంగాణా చరిత్రలో సువర్ణాక్షర లిఖితం

## సెప్టెంబర్ 17 ఉద్విగ్న సందర్భం...

(మొదటిపేజీ తరువాయి)


రాజకీయ పార్టీలు పరిస్థితులు, ఓటు బ్యాంకులు, సున్నితమైన భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుని రకరకాల పేర్లతో పిలవొచ్చు. 1948 సెప్టెంబర్17న పోలీసు చర్యతో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయాడు. దీంతో తెలంగాణా ప్రాంతం భారతదేశంలో విలీనమైనపోయినట్లేనని చాలా మంది వాదన. అందుకే సెప్టెంబర్17ను విలీన దినోత్సవంగా జరపాలంటారు. అయితే సెప్టెంబర్17న తెలంగాణా పూర్తిగా భారతదేశంలో విలీనం కాలేదనేది కూడా అంతే వాస్తవం. సాంకేతికంగా 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చేవరకు తెలంగాణా నిజాం పాలనలోనే ఉంది. అయితే పేరుకే నిజాం ప్రభువు అయినప్పటికీ ఇక్కడ పౌరప్రభుత్వం ఏర్పాటు నుంచి సైనిక శక్తి అంతా భారత ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోయింది. దీంతో నిజాం దుష్టపాలన నుంచి ఖాసీం రజ్వీలాంటి రజాకార్ నాయకుల నుంచి తెలంగాణా ప్రజలు విముక్తి పొందారు. అందుకే సెప్టెంబర్17ను విమోచన దినంగా పరిగణించాలన్న వాదనలు. సెప్టెంబర్17న తెలంగాణా విలీనం జరిగిందా లేక విమోచన జరిగిందా అనే చర్చ సుదీర్ఘ కాలంగా కొనసాగుతూనే ఉంది. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బిజెపి జరుపుతుండగా, సాయుధ రైతాంగ పోరాట విజయంగా వామపక్షాలు, ప్రజాపాలన దినోత్సవంగా కాంగ్రెస్ ప్రభుత్వం జరుపుతున్నాయి. ఎవరు ఎలా జరిపినా సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు చిరకాలం గుర్తుండేరోజు. పోరాటాలు ఫలించి స్వేచ్ఛావాయువులు పీల్చిన రోజు

# టీటీడీ బోర్డు కీలక నిర్ణయాలు

## రాష్ట్రవ్యాప్తంగా 1000 ఆలయాల నిర్మాణానికి బోర్డు అంగీకారం

## టిటిడిపై తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు

**తిరుమల, మహా:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్ లో మంగళవారం ఛైర్మన్ అధ్యక్షతన టిటిడి పాలక మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని కీలక నిర్ణయాలపై చర్చించారు. అనంతరం ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను టీటీడీ ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ తో కలిసి ఛైర్మన్ మీడియాకు వివరించారు. తిరుమలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 02వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. సెప్టెంబర్ 24వ తేదీ సాయంత్రం 05.43 గం.ల 06.15 గం.ల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణము నిర్వహించడం జరుగనుఃదన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సెప్టెంబర్ 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారని, అదే రోజు రాత్రి 9 గంటలకు శ్రీవారి పెద్దశేష వాహనంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని టిటిడి ముఖ్య అధికారి అశోక్ సింగల్ తెలిపారు. 25న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిఏసి 5 శ్రీ వెంకటాద్రి నిలయాన్ని ప్రారంభిస్తారని, అదేవిధంగా 2026వ సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారన్నారు. బ్రహ్మోత్సల సందర్భంగా ఈ నెల 23వ తేదీ నుండి అక్టోబర్ 02వ తేదీ వరకు దివ్యాంగులు, వయోవృద్ధులు, ఎన్.ఆర్.ఐ, చిన్నపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తున్నట్లు వివరించారు. 28న గరుడ సేవ సందర్భంగా ఈ నెల 27వ తేదీ రాత్రి 9 గంటల నుండి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తిరుమలకు ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే బోర్డు వివిధ తీర్మానాలను ఆమోదించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మొదటి దశలో రాష్ట్రంలోని దళిత వాడల్లో 1000 ఆలయాలను నిర్మించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. టిటిడిపై దుష్ప్రచారం చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, ఎం.ఎస్. రాజు, శ్రీమతి పనబాక లక్ష్మి, శ్రీ నర్సిరెడ్డి, సదాశివరావు, శ్రీమతి జానకి దేవి, జంగా కృష్ణమూర్తి, శాంతా రామ్, శ్రీమతి సుచిత్ర ఎల్లా, శ్రీమతి రంగశ్రీ ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



# లండన్‌లో లోకేష్

## 150 మంది దిగ్గజ సీఈవోలతో భేటీ

## 14 లక్షల కోట్ల విలువ గల కంపెనీల ప్రతినిధులతో చర్చలు



**మహా :** ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ దూసుకెళ్తున్నారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్న ఆయన, అక్కడ పలు దిగ్గజ కంపెనీల అధినేతలతో కీలక సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించి, ఏపీని ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా ప్రమోట్ చేస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా లండన్‌లో ఏర్పాటు చేసిన ఒక చర్చా కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన కార్పొరేట్ సంస్థల నికర విలువ సుమారు 170 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 14 లక్షల కోట్లకు పైగా) ఉంటుందని ఆయన స్వయంగా వెల్లడించారు. లండన్‌లోని సీనియర్ వ్యాపారవేత్తలతో జరిగిన ఈ భేటీ ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. 150మంది సీఈవోలతో లోకేష్ భేటీ అయ్యారు. ఈ ఉన్నత స్థాయి సమావేశం ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ 2025 లో పాల్గొనాల్సిందిగా గ్లోబల్ లీడర్లను ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు, ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలను మంత్రి లోకేశ్ వారికి వివరించారు. గత 15 నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 10,06,799 కోట్ల విలువైన 122 భారీ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చిందని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమల కోసం ఒక లక్ష ఎకరాల భూమి కలిగిన పారిశ్రామిక క్లస్టర్లను ప్రభుత్వం సిద్ధం చేసిందని లోకేశ్ తెలిపారు.

# అడ్డిమారి గుడ్డిదెబ్బలో గెలిచిన పొంగులేటి

## ..ఈసారి ఎట్లా గెలుస్తారో చూస్తా..

## తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సవాల్

### పోయిన దీపావళికి పొంగులేటి బాంబులు పేలుతాయని చెప్పారు

### పొంగులేటి బిజెపితో కుమ్మక్కయ్యారు

### తెలుగు వారికి ఎన్టీఆర్ ఎంతో.. తెలంగాణకు కేసీఆర్ అంత

(మొదటిపేజీ తరువాయి)



హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో భద్రాచలం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కేటీఆర్, కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. తెలుగువారు ఉన్నారని ప్రపంచానికి చాటిన వ్యక్తి ఎన్టీఆర్. తెలంగాణ వారు ఉన్నారని చెప్పిన వ్యక్తి కేసీఆర్. తెలుగువారికి ఎన్టీఆర్ ఎంతో.. తెలంగాణకు కేసీఆర్ అంత. ప్రతిపక్షాన్ని తొక్కాలి అంటే ఒక్కరు బయటతిరిగే వారు కాదు. నోట్ల కట్టలతో దొరికిన రేవంత్ రెడ్డిని వదిలేశాం. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ నిర్మాణం చేయడంలో తప్పు చేశాం. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేయడంలో విఫలం అయ్యాం. ఆ భాద్యత నేను తీసుకుంటాను. శిక్షణా తరగతులు పెట్టుకోవడంలో విఫలం అయ్యాం. పోయిన దీపావళికి బాంబులు పేలుతాయని పొంగులేటి చెప్పారు. ఈ దీపావళికి బాంబులు పేలలేదు. పొంగులేటి పెద్ద బిల్డప్ అంటూ విమర్శలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎందుకు అంత పిరికివాళ్లుగా మారిపోయారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**ఫిరాయింపు ఎమ్మెల్యేలు పిరికిపందలు**

నిజంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను చేర్చుకున్న కాంగ్రెస్‌కు దమ్ముంటే, "వారు మా కాంగ్రెస్‌లో చేరారు, ఉప ఎన్నికలకు పోదాం" అని చెప్పాలన్నారు. తంతే గారెలు బుట్టలో పడినట్టు, లక్కీ లాటరీలో పడ్డట్టు మంత్రి అయిన పొంగులేటి పెద్దగా మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో అహంకారంతో ఎగిరితే తిప్పికొడతారని తెలిపారు. మళ్లీ పాలేరులో ఎలా గెలుస్తారో చూద్దామన్నారు. ఏడాది క్రితం పొంగులేటి ఇంటిపై జరిగిన ఈడీ దాడుల గురించి కేంద్రం గానీ, ఆయన గానీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆ దాడుల్లో దొరికిన డబ్బులు ఎన్నో ఎవరూ చెప్పలేదన్నారు. మరి పొంగులేటి బీజేపీతో కుమ్మక్కయ్యాడా? లేదా బీజేపీతో కుమ్మక్కైన రేవంత్ రెడ్డితో పొంగులేటి కలిసిపోయాడా? అని ప్రశ్నించారు. బతికినంత కాలం ధైర్యంగా బతకాలి కానీ ఇంత నీచమైన కుమ్మక్కు రాజకీయాలు ఎందుకు అని విమర్శించారు.

# పన్నీరు వారి పాల దందా

## హ్యాపీరావు ఘోరాలు.. కవితక్క అప్ డేట్స్ వైరల్

(మొదటిపేజీ తరువాయి)



అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ వైస్ షాప్ చేస్తున్న తప్పిదాలని ప్రజల ముందు పెట్టి వాళ్లు చేస్తున్న స్కామ్ ను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేసారు. టానిక్ సంస్థ జీఎస్టీ ఎగొడుతుంది అని తెలుసుకొని లోతుగా దర్యాప్తు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. సెంట్రల్ జీఎస్టీ కూడా వీటిపైనా ఆరాతీసింది కానీ అక్కడ సెంట్రల్ కి ఎటువంటి సమాచారం దొరకలేదు. ఈ ప్రక్రియలో ఒక నిజాయితీ గల జీఎస్టీ ఆఫీసర్ బలి అయ్యాడు. అప్పటివరకు హడావిడి చేసిన మీడియా, సోషల్ మీడియా తరువాత ఎటువంటి సమాచారాన్ని బైట పెట్టలేదు. ప్రచారం చెయ్యలేదు. ఇంతకీ అసలు ఏమైంది ఎందుకు ఇప్పుడు ఆ ఊసు లేదు అని ఆలోచిస్తే.. హ్యాపీరావు కర్నాటక "డి"ఒక పెద్దమనిషిని హోటల్ లో కలిసి ఒక ఒప్పందానికి వచ్చిండ్లు అని సమాచారం. అప్పటినుండి ఆ సంస్థ చేసిన స్కాములు మాయం అయ్యాయి' అంటూ పోస్టులో పేర్కొన్నారు.

### పన్నీరు వారి పాల వ్యాపారం

ఒక సామాన్య వ్యక్తి పాల వ్యాపారం చేస్తే అతను నిలదొక్కుకోవడానికి చాలా కష్టపడాలి. కానీ కంపెనీ పెట్టగానే లాభాల్లోకి పోవడం మనం ఈ సంస్థలో చూస్తం. ప్రభుత్వానికి సంబంధించిన ఎస్సీ/ఎస్టీ గురుకులాలు అనేకమైన వాటిల్లో తన అధికారం ఉపయోగించి తన పాలే ఉండేలా చూసుకున్నారు. మన సిద్దిపేట మోడల్, అటువంటి ప్రభుత్వ సంస్థల్లో బడుగు బలహీన వర్గాలకు సంబందించిన ఎంట్రప్రెన్యూర్స్ ని ప్రోత్సహించాలి. కానీ ఆలా జరగలేదు. అధికారాన్ని వాడుకొని తన సొంత సంస్థకు లాభం చేకూరేలా చేసుకున్నాడు మన అగ్గిపెట్ట మచ్చ. ఆ కంపెనీ మీద ఒక ఓ యూట్యూబ్ చానల్ అనేక కథనాలు నడిపి సెటిల్మెంట్ చేసుకొని చేతికి డబ్బులు అందినంక సైలెంట్ అయిపోయాడు. ఆ కంపెనీలో కేవలం పాల వ్యాపారం కాకుండా ఎమ్మెల్యేలు ట్రేడింగ్ వ్యాపారం కూడా జరిగింది. కేవలం పార్టీ ఇచ్చిన ఫండింగ్ కాకుండా తన సొంత పైసలు 20 మందికి పైగా ఎమ్మెల్యేలకు ఇచ్చి అవసరం అవుతే తనతో బైటికి రావాలని ఒప్పందం. చేసుకున్నాడు' అంటూ కవితక్క అప్ డేట్స్ లో కవిత టీం పేర్కొంది.

### ఇప్పుడెందుకు సైలెంట్

'హ్యాపీ రావు, అగ్గిపెట్టె మచ్చపై గద్దెనెక్కినంక కొన్ని రోజులు ఇంతెత్తు ఎగిరి పడ్డ రేవంత్ ప్రభుత్వం.. ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యింది. సామాజిక తెలంగాణలో బహుజ నులకు దక్కాల్సిన కొన్ని పనులను తానే లాభం చేకూర్చుకోవడం నిజమైన సామాజిక తెలంగాణ? ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వంతో అంటకాగుతున్నది ఎవరు? ఎందుకు? అని ఆ వ్యక్తుల మీద ప్రభుత్వం యాక్షన్ తీసుకుంట లేదు? ఆర్ఎస్ ప్రవీణ్ ఇప్పుడు చెప్పండి రేవంత్ రెడ్డితో లాలూచీ పడుతున్నది ఎవరో?' అంటూ కవిత టీం ట్వీట్ చేశారు.

# అవినీతి అనకొండ

## రూ. 300 కోట్ల అక్రమాస్తులు.. విద్యుత్ ఏడీఈ అరెస్ట్

### ఏడీఈ అంబేద్కర్ నివాసంతో పాటు బినామీలు, బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు

### భారీగా నగదు, బంగారం, ఇళ్ల డాక్యుమెంట్లు, వ్యవసాయ భూముల పత్రాలు గుర్తింపు

### బినామీ సతీష్ ఇంట్లో రూ.2 కోట్ల 18 లక్షల రూపాయలు సీజ్ చేసిన అధికారులు




**హైదరాబాద్, మహా:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్‌ను ఏసీబీ అరెస్టు చేసింది. ఏసీబీ అధికారులు 18 బృందాలుగా విడిపోయి హైదరాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో అంబేద్కర్ నివాసంతో పాటు బినామీలు, బంధువుల ఇళ్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో రూ.300 కోట్లకు పైగా అక్రమాస్తులను గుర్తించినట్లుగా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు. అంబేద్కర్ బినామీ సతీష్ ఇంట్లో రూ.2 కోట్ల 18 లక్షల రూపాయల నగదును ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. కొండాపూర్‌లోని మ్యాగ్నాలేక్ లోని వ్యూ అపార్ట్ మెంట్‌లో నివాసం ఉంటున్న అంబేద్కర్‌కు.. నానక్ రామ్ గూడాలోని అంబేద్కర్ పర్సనల్ కార్యాలయం ఉంది. ఇబ్రహీంబాగ్‌లో ఏడీఈగా పనిచేస్తున్న అంబేద్కర్ నివాసంలో భారీగా నగదు, బంగారు ఆభరణాలు, ఇళ్ల డాక్యుమెంట్లు, వ్యవసాయ భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

### భారీగా వ్యవసాయ భూములు..

హైదరాబాద్ నగరంలో ఆరు ఇంటి స్థలాలు గుర్తించారు. 2కోట్లకు పైగా ఉన్న స్థలాల డాక్యుమెంట్లను గుర్తించారు. 70లక్షల బ్యాంకు బ్యాలెన్స్, 5.50 లక్షల నగదు, 40 లక్షల విలువైన రెండు కార్లు సీజ్ చేశారు. శేర్లింగంపల్లిలో అధునాతనమైన ఐదు అంతస్తుల భవనం, నగర శివారులో అధునాతన ఫామ్ హౌస్, పది ఎకరాల స్థలంలో పెద్ద కెమికల్ కంపెనీ ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఇబ్రహీంబాగ్‌లో ఏడీఈగా పనిచేస్తున్న ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడని ఏసీబీ దాడులు నిర్వహించింది. తనిఖీల్లో ఇప్పటికే సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో 10 ఎకరాలు వ్యవసాయ భూమి, మరో వెయ్యి గజాల్లో వ్యవసాయ క్షేత్రం గుర్తించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో సోదాలు కొనసాగుతున్నాయని.. సోదాలు ముగిశాక మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు.

# రాష్ట్రంలో కొత్త డిస్కం



(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయం, మేజర్, మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సరఫరా, జీహెచ్ఎంసీ పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియోగాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంలను మూడు డిస్కంలుగా పునర్విభజన చేయాలని సీఎం సూచించారు. మూడవ డిస్కంకు సంబంధించి పీపీఏ అలొకేషన్, సిబ్బంది విభజన, ఆస్తుల విభజన, బకాయిలు, ఇతర అంశాలపై ముఖ్యమంత్రి మంగళవారం కీలక సూచనలు చేశారు. కేబినెట్ ఆమోదం అనంతరం కొత్త డిస్కం ముందుకెళ్ళాలని సీఎం సూచించారు. వీలైనంత త్వరగా కొత్త డిస్కం ఏర్పాటుకు సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్

### యువ ప్రతిభావంతులకు గోల్డెన్ ఛాన్స్.. విజేతలకు టీఎఫ్‌డీసీ భారీ నజరానా

**హైదరాబాద్, మహా:** తెలంగాణలోని యువ సృజనశీలురకు పట్టం కట్టేందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ పేరిట షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తోంది. 3 నిమిషాలు, 5 నిమిషాల లోపు నిడివి కలిగిన రెండు కేటగిరీల్లో షార్ట్ ఫిలిమ్స్ పంపించాలని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు కోరారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం (మహిళలకు ఉచిత బస్సు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ తదితరాలు), తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిమ్స్, పాటల పోటీలు పంపించాలి. సెప్టెంబర్ 30 లోపు ఎంట్రీలను పంపించాల్సి ఉంటుందని, గడువులోగా అందిన ఎంట్రీలను నిపుణులతో కూడిన జ్యూరీ వీక్షించి ఎంపిక చేస్తారని దిల్ రాజు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి భవిష్యత్తులోనూ అనేక రకాలుగా ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను దిల్ రాజు విడుదల చేశారు. ఎంట్రీలను ఈ కింది మెయిల్ ఐడీ youngfilmmakerschallenge@gmail.com లేదా వాట్సాప్ నంబర్ 8125834009 కు పంపించాల్సి ఉంటుంది. పోటీలో ఎంపికైన షార్ట్ ఫిలిమ్స్‌కు ప్రథమ బహుమతి రూ. 3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 2 లక్షలు, తృతీయ బహుమతి రూ. 1 లక్ష చొప్పున అందిస్తారు. మరో ఐదుగురికి రూ. 20 వేల చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేస్తారు. వీటితో పాటు బహుమతి గ్రహీతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను ప్రదానం చేస్తారు.



**పోటీలో పాల్గొనడానికి అర్హతలు..**

1. ఈ పోటీలో పాల్గొనే వారి వయసు 40 ఏళ్ల లోపు ఉండాలి.
2. 4K రిజల్యూషన్ కలిగి ఉండాలి.
3. షార్ట్ ఫిల్మ్స్ / వీడియో సాంగ్స్ ఏవైనా ఈ పోటీలలో సూచించిన 'థీమ్' ల పైనే ఉండాలి.
4. మీరు చేసిన వీడియోలు గతంలో ఎక్కడా ప్రదర్శించి ఉండకూడదు.
5. బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ కోసం మాత్రమే చిత్రీకరించినవై ఉండాలి.

## ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద రోడ్డు ప్రమాదం ఒక వ్యక్తి మృతి!





- ఐదుగురికి తీవ్ర గాయాలు
- శంషాబాద్ విమానాశ్రయాన్ని చూడడానికి వెళుతుండగా ప్రమాదం
- ఆదిభట్ల ఎస్ఐ సత్యనారాయణ

**రంగారెడ్డి జిల్లా మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గత రాత్రి, బొంగులూరు ఎగ్జిట్ 12 వద్ద ఘోరమైన రోడ్డు ప్రమాదం సంభవించింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం ఆంధ్రప్రదేశ్ కు చెందిన, శివ కోటేశ్వరరావు, క్రాంతి కుమార్, శ్రీహరి, మహేష్ వర్మ, రాజేంద్ర, రామకృష్ణ అనే ఆరుగురు వ్యక్తులు, జిల్లాలోని శంషాబాద్ విమానాశ్రయాన్ని తిలకించడానికి వెళ్తున్న క్రమంలో, బొంగులూరు ఎగ్జిట్ 12 సమీపంలో ఓఆర్ఆర్ పైన వాహనాన్ని పక్కన నిలపడంతో, వెనకనుంచి అతి వేగంగా వచ్చిన ఓ భారీ లారీ, కారును ఢీకొట్టడంతో, కారులోని ఆరుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన ఘటన ప్రదేశానికి చేరుకున్న పోలీసులు, క్షతగాత్రులను మన్నెగూడలోని మహోనియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించడం జరిగిందని, మరో ఇద్దరిని నగరంలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వారిలో ఒకరైన శివ కోటేశ్వరరావుకు తీవ్ర రక్తస్రావం కావడంతో, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఎస్సై తెలిపారు. లారీని నిర్లక్ష్యంగా నడుపుతూ, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టడం జరిగిందని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, మన్నెగూడ లోని మహోనియా ఆసుపత్రిని సందర్శించి, క్షతగాత్రులను పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.



## పేదింటి బిడ్డల వివాహానికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌తో చేయూత

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ మండల తహసీల్దార్ బొమ్మ రాములు ఆధ్వర్యంలో మండల కార్యాలయ ఆవరణలో కళ్యాణి లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ 276 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ మండలంలోని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ మొత్తం 276, లబ్ధిదారులు, అందులో 184షాదీముబారక్, 92 కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా లబ్దిపొందాలన్నారు. పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు లబ్ధిచేకూరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు లబ్ధిదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం



### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండల్ ఎంపీడీవో మున్ని ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు, పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేస్తారని ప్రశంసించారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదు, అది ఒక గొప్ప సేవ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండలంలోని ఉపాధ్యాయులలో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి తో కలిసి జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుస్మారెడ్డి వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలలుకు సంబంధించిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అచ్చంపేటకు గువ్వల బాలరాజు రాక

### బైక్ ర్యాలీ విజయవంతం చేయాలి: సోలంకి శ్రీనివాస్



**రంగారెడ్డి జిల్లా మహా:** నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేట మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు బిజెపిలో చేరిన తర్వాత, మొదటిసారి నేడు అచ్చంపేటకు వస్తున్న సందర్భంగా బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని సోలంకి శ్రీనివాస్ అన్నారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో, రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ... నేడు బుధవారం అచ్చంపేట మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు రాష్ట్ర పార్టీ ఆఫీసులో బిజెపిలో చేరిన తర్వాత, మొట్ట మొదటిసారిగా అచ్చంపేట నల్లమల్ల గడ్డపై అడుగుపెడుతున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, జాతీయ భావజాలం కలిగిన ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వాగతం పలకాలని, రాష్ట్రంలో అచ్చంపేట నియోజకవర్గంలో జరుగుతున్న, కాంగ్రెస్ అవినీతి పాలను చరమగీతం పాడడం కోసం, ప్రజల పక్షాన పోరాటం చేసి రాబోయే రోజుల్లో, గువ్వల బాలరాజును అచ్చంపేట ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించి, దేశ ప్రధాని నరేంద్ర మోడీకి కానుక ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, అమ్రాబాద్ ఎలక్షన్ ఇంచార్జి బల్మూరు జానకి, జిల్లా కార్యదర్శి వరికుప్పల అంజి, జిల్లా నాయకులు గోలి రాజు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రామోజీ, నోముల చంద్రయ్య గౌడ్, నోముల శంకర్ గౌడ్, రాములు, రామకృష్ణ, అశోక్, బాలకృష్ణ, ప్రసాద్, రామచంద్రయ్య, లక్ష్మీనారాయణ, శంకర్, డీజే రాజు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## యాచక వృద్ధురాలిపై ఓ ప్రబుద్ధుడి అఘాయిత్యం

### నిందితుడిని పట్టుకుని శిక్షిస్తాం: సిఐ మహేందర్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నం బస్టాండు పరిసర ప్రాంతం ఫుట్ పాత్ పై నిద్రిస్తున్న, యాచక వృద్ధురాలి (60) పై, గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని, నిందితుడు కోసం నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నామని, సీసీ కెమెరాల ఆధారంగా నిందితుని గుర్తించి త్వరలో పట్టుకుంటామని సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు. వృద్ధురాలిని వైద్య చికిత్సల కోసం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నానుబైలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని, ఎవరు కూడా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడవద్దని సీఐ హెచ్చరించారు.

## బిఆర్ఎస్ పార్టీ నాయకులను టార్గెట్‌గా చేసుకొని పదవులను తొలగిస్తున్నారు

### సొసైటీ మాజీ చైర్మన్ బుర్కుంటా సతీష్

రాజేంద్రనగర్ మహా ; శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సొసైటీ మాజీ చైర్మన్ బుర్కుంటా సతీష్ , బిఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ చైర్మన్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో సొసైటీ చైర్మన్ గా ఐదు సంవత్సరాల పదవీకాలం పూర్తయిన తర్వాత మరో ఆరు నెలలుగా రెండుసార్లు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. అందులో ఆరు నెలలు పూర్తయిన తర్వాత రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తనపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ బీఫాంతో ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కష్టపడి చెమటోడ్చి ప్రభుత్వ పథకాలను కెసిఆర్ నాయకత్వ లక్షణాలను చూసి ప్రజలు మరోసారి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ను ఆశీర్వదించారు. గెలిచి సంవత్సరం కూడా బిఆర్ఎస్ పార్టీలో ఉండలేకపోయిరు, అధికార దాహంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో తనతో రాని వారిపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ చైర్మన్ బుర్కుంటా సతీష్ ఆరోపించారు. సొసైటీలో రైతు రుణాలను రాబట్టలేకపోతున్నారు. కావున మిమ్మల్ని సొసైటీ చైర్మన్ పదవి నుంచి తొలగిస్తున్నామన్నారు. కేవలం ఇది సాకుగా చూపి బిఆర్ఎస్ నాయకుల పై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు, ఈ రెండు సంవత్సరాలు పూర్తయిన రైతు రుణమాఫీ పూర్తిగా జరగలేదు, రైతుబంధు రాలేదు, యూరియా సరైన సమయంలో ఇవ్వడం లేదు, రైతులు పుట్టెడు కష్టాల్లో ఉన్న రుణాలను ఏ విధంగా అడగాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సర్వీస్ చేస్తుంటే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చూసి ఓర్వలేక తనను చైర్మన్ పదవి నుంచి తొలగించారు. రాబోయే కాలంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాబోతుంది. ఇంతకు రెండింతలు కక్ష సాధింపు చర్యలు ఉంటాయని హెచ్చరించారు.




మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?

ANN SCHOOL OF JOURNALISM ANN TELUGU ESTD.2025

జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం

ANN SCHOOL OF JOURNALISMలో

జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.



గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు

ఇదే మా ఆహ్వానం

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 21

తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 28

పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన

మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు

8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు

కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును

మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్ షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్

HURRY UP! LIMITED TIME త్వరపడండి...

FOR ADMISSIONS CONTACT: +91 74369 39999

SCAN ME

APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM



ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM,

95501 59679, 90001 41919

EDITORIAL
సంపాదకీయం

# నేటి మహిళ

# సుశీలా కర్కి

## సంక్షోభ సమయంలో టార్చ్ బేరర్



(మహా ప్రత్యేకం)

నేపాల్‌కు కొత్తగా నియమితులైన తాత్కాలిక ప్రధానమంత్రి సుశీలా కార్కి ఆరు నెలలకు మించి తాను ఈ పదవిలో ఉండనని చెప్పారు. ''ఈ పదవిని నేను కోరుకోలేదు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల తర్వాత, నేను దీన్ని అంగీకరించాల్సి వచ్చింది'' అని సుశీలా కార్కి స్పష్టీకరించారు. పదవులంటే ఆమెకు వ్యామోహం లేదని, ఆమె మహోన్నత వ్యక్తిత్వమే సంక్షోభసమయంలో దేశమంతా చూసేలా చేసిందని స్పష్టమవుతోంది. ఇండియా - నేపాల్ దేశాల మధ్య అనుబంధం ఈనాటిది కాదు. ప్రభుత్వాలు వాటి వాటి విధానాల వల్ల పని చేస్తుండొచ్చు. కాని ఇరుదేశాల ప్రజలు ఏనాటి నుంచో స్నేహంగా ఉన్నారు. ప్రధాని మోదీపై నాకు మంచి అభిప్రాయం ఉంది. మా స్నేహితులు, బంధువులు ఎందరో ఇండియాలో ఉన్నారు. మావారు ఎక్కువ కాలం ఇండియాలోనే గడిపారు. భారతీయులు నేపాలీలను ఆదరిస్తూనే ఉన్నారు' అన్నారు సుశీలా కర్కి. 73 ఏళ్ల ఈ మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేపాల్‌లో ఏర్పడ్డ ఆపద్ధర్మ ప్రభుత్వానికి ప్రధాని అయ్యారు. ముగ్గురితో కేబినెట్ కూడా ఏర్పాటుచేశారు. దేశాన్ని చక్కదిద్దే బాధ్యతలో నిమగ్నమయ్యారు. నేపాల్‌లో ఉద్యమం కొనసాగిస్తున్న జెన్ జి విద్యార్థుల బృందం మొదట ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి సుశీలా కర్కి మా ఎంపిక అని తేల్చి చెప్పింది. సుశీలా కర్కి తన సోషల్ మీడియా అకౌంట్‌లో 'దేశ పరిస్థితుల రీత్యా నాకు అప్పజెప్పే బాధ్యతను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను' అని తెలియచేశారు. ఆ తర్వాత పరిస్థితులు చకచకా మారిపోయాయి. అవినీతికి ముగింపు పలకాలని, సుపరిపాలనను, ఆర్థిక సమానత్వాన్ని సాధించాలని జెన్ జడ్ డిమాండ్ చేస్తోంది. జన్ జడ్ ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలని కర్కి అధికారయంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

### పారే గంగను చూసి..

'నేను బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్నాను. మా హాస్టల్ నుంచి నిత్యం పారే గంగను చూసేదాన్ని. ఎండాకాలం హాస్టల్ టెర్రస్ మీద పడుకునేవారం. ఉదయాన్నే గంగను చూసేవారం. అక్కడ నాతో పాటు చదువుకున్న విద్యార్థులు, పాఠాలు చెప్పిన గురువులు ఇంకా స్పష్టంగా గుర్తున్నారు'. 'మా ఊరు విరాట్‌నగర్ నుంచి భారత్ సరిహద్దు 25 మైళ్లు ఉంటుంది. మేము తరచూ బోర్డర్ మార్కెట్‌కు వెళ్లేవాళ్లం. నాకు హిందీ వచ్చు' అని కర్కి తెలిపారు. ప్రభుత్వంలో అవినీతి, మంత్రుల పట్ల వ్యతిరేకత, నయా సంపన్నుల వైఖరి, సోషల్ మీడియాపై నిర్బంధం... వీటన్నింటి దరిమిలా నేపాల్‌లో యువతరం తెచ్చిన తిరుగుబాటు వల్ల నాయకత్వ మార్పు స్పష్టమైంది. సుశీలా కర్కి ఆపద్ధర్మ ప్రధాని కాగా, యువతరం ఆమెను కోరుకోవడం అంటే ఎంత నిక్కచ్చిగా పనిచేసిందో తెలుస్తుంది.

### సుప్రీంకోర్టు సీజే వరకు

సుశీలా కర్కి నేపాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని నిర్వహించిన ఏకైక మహిళగా ఆ దేశవాసుల్లో గుర్తింపు, గౌరవం పొందారు. జూన్ 7, 1952న నేపాల్‌లోని శంకర్‌పూర్‌కు చెందిన ఓ కుటుంబంలో పుట్టిన కర్కి ఏడుగురు పిల్లలలో మొదటి సంతానం. 1972లో బిరాట్‌నగర్‌లోని మహేంద్ర మొరాంగ్ క్యాంపస్ నుండి బీఏ డిగ్రీ చేసి మన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి రాజకీయ శాస్త్రం చదివారు. అక్కడ చదువుతున్న సమయంలోనే నేపాలీ కాంగ్రెస్ సభ్యుడు, యువజన విభాగ నాయకుడు దుర్గా ప్రసాద్ సుబేదిని కలుసుకున్నారు. అనంతరం వారిద్దరూ వివాహం చేసుకున్నారు. 1979లో కార్కి బిరాట్‌నగర్‌లో లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 1985లో ధరణ్‌లోని మహేంద్ర మల్టిపుల్ క్యాంపస్‌లో అసిస్టెంట్ టీచర్‌గా పనిచేశారు. 2007లో సీనియర్ అడ్వకేట్‌గా 2009లో ఆ దేశ సుప్రీంకోర్టులో అడ్-హాక్ జస్టిస్‌గా నియమితులయ్యారు. నవంబర్ 18, 2010న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016 ఏప్రిల్ నుండి 2016 జూలై వరకు నేపాల్ సుప్రీంకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, 2017 జూన్ వరకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.

### శాంతికే ప్రాధాన్యం

కర్కి 2018లో 'న్యాయ' పేరుతో తన ఆత్మకథ రాశారు. 2019 డిసెంబర్‌లో 'కారా' అనే నవల ప్రచురించారు. నేపాల్‌లో 1960 నుంచి 90ల మధ్య కాలంలో రాజు కనుసన్నల్లో సాగిన 'పంచాయత్' ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రజల అనుభవాలను ఆమె తన రచనల్లో ఉటంకించారు. ఆపద్ధర్మ అధినేతగా తన ఎంపిక జరిగితే శాంతి నెలకొల్పడం, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు భరోసా ఇవ్వడం తన తొలి ప్రాధాన్యం అని ఆమె అన్నారు. ఆ దిశగా ప్రయత్నిస్తున్నారు. ఆమె న్యాయనిపుణత, అవినీతి రహిత నేపథ్యం చాలా కేసుల్లో కీలకమైన తీర్పులు ఇచ్చేలా చేసింది. ఒక అవినీతి కేసులో మంత్రిని జైలుకు పంపించడానికి సైతం ఆమె వెనుకాడలేదు. ఇవన్నీ ఆమెకు సానుకూలంగా మారాయని చర్చ సాగుతోంది. ఆ పేరు బయటకు వచ్చాక నేపాల్‌లో ముఖ్యంగా ఖాట్మండులో శాంతి నెలకొనడం ఆమె మాటకు ప్రజలు ఇచ్చే విలువను స్పష్టం చేస్తున్నది. సుశీల కర్కి బాధ్యతలు స్వీకరించడంతో పాటు శాంతి దిశగా దేశాన్నినడిపిస్తున్నారు. జెన్ జడ్ ఉద్యమంలో చనిపోయిన వారిని అమరవీరులుగా ప్రకటించనున్నట్లు ప్రధానమంత్రి సుశీలా కార్కి చెప్పారు. బాధిత కుటుంబాలకు, గాయపడిన వారికి అవసరమైన పరిహారాన్ని అందజేస్తామని తెలిపారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ఇవ్వనుంది.

### కార్కి ముందున్న సవాళ్ళు

నేపాల్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన సుశీలా కార్కికు క్లీన్ ఇమేజ్ ఉంది. వివాదాల నుంచి ఆమె కూడా తప్పించుకోలేకపోయారు. ఆమె కఠిన వైఖరి కారణంగా, రాజకీయాల్లో వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రధాన న్యాయమూర్తిగా సుమారు 11 నెలల తన పదవీ కాలంలో అభిశంసన తీర్మానాన్ని కూడా ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కార్కి, ఆమె కేబినెట్ సభ్యులు పలు సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంది. శాంతిభద్రతలను పునరుద్ధరించాలి. నిరసనకారులు దాడి చేసి ధ్వంసం చేసిన పార్లమెంట్‌ను, ఇతర భవంతులను తిరిగి నిర్మించాలి. మార్పును కోరుకుంటోన్న జెన్ జడ్ ఆందోళనకారులకు భరోసా ఇవ్వాలి.

# ఆదివాసీలు, లంబాడీల మధ్య వివాదానికి కారణాలేంటి..?



తెలంగాణలో ఆదివాసీ, గిరిజన తెగల మధ్య ముదురుతున్న వివాదం రాజకీయ, సామాజిక, చట్టపరమైన అంశాలను తెర మీదికి తీసుకువస్తున్నది, ఎస్టీ రిజర్వేషన్ కోటా హక్కులపై పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది. గత దశాబ్దాలుగా గోండు, కోయ వంటి ప్రాథమిక ఆదివాసీ తెగలు, లంబాడీల (బంజారాలు)ను షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) జాబితా నుండి తొలగించాలనే డిమాండ్ చేస్తున్నాయి. ఎస్టీ కోటా ద్వారా లభించే విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎక్కువ శాతం లంబాడీలే లబ్ధి పొందుతున్నారని, దీనివల్ల నిజమైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఇటీవలి పరిణామాలు వీరి పోరాటాన్ని మరింత తీవ్రతరం చేశాయి. ఆదివాసీ తెగకు చెందిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దాఖలు చేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ (పిల్)పై 2025 ఆగస్టు 29న సుప్రీంకోర్టు లంబాడీ, సుగాలీ, బంజారా సముదాయాల ఎస్టీ స్థితిని ప్రశ్నిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో లంబాడీల ఎస్టీ స్థితిని నిర్ధారించినప్పటికీ, ఆదివాసీలు అది రాజ్యాంగం 342 అధికరణాన్ని ఉల్లంఘిస్తుందని వాదిస్తున్నారు. లంబాడీలు మొదటి నుండి తెలంగాణ ప్రాంతంలో ఆదివాసీలుగా గుర్తించబడలేదని, వారి చేర్పు వల్ల తమ రాజ్యాంగ పరమైన హక్కుల్ని కోల్పోతున్నామని, ఆదివాసీలు వాపోతున్నారు. ఈ అంశం రాజ్యాంగ, చట్టపరమైన పరమైన చర్చలకు దారితీసింది. ఎందుకంటే ఎస్టీలు 'ప్రైమిటివ్', 'వెనుకబడిన', 'ఒంటరి' తెగలుగా గుర్తించబడాలి.

ఇటీవలే ఈ అంశంపై ఆదివాసీల తరుపున సుప్రీం కోర్ట్ లో తెల్లం వెంకటరావు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుగా నమోదైంది, ఈ విచారణలో ప్రధానంగా 1976 ఆంధ్రప్రదేశ్ ఎస్టీ ఆర్డర్ (ఏపీఎస్టీ ఆర్డర్)లో లంబాడీల చేర్పును ప్రశ్నించే అంశాలు చర్చకు వస్తాయి. ఈ చట్టం 1950 జనవరి 26కు ముందు తెలంగాణలో స్థిరపడిన లంబాడీలకు మాత్రమే వర్తిస్తుందని, 1950 తర్వాత వలసల్ని చేర్చకూడదని నిబంధన ఉంది. కానీ లక్షలాది మంది ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చినవారు కూడా ఎస్టీ ప్రయోజనాలు పొందారని అభిప్రాయ పడుతున్నారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. "మహారాష్ట్రలో బీసీలు, రాజస్థాన్‌లో ఓసీలుగా ఉన్న లంబాడీ (బంజారా)లు ఇక్కడ ఎలా ఎస్టీలయ్యారు?" అని ఆదివాసీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ విచారణ ఫలితంగా వెలువడే తీర్పు ఎస్టీ జాబితాను మార్చే అవకాశం ఉంటుందో లేదో కాలమే నిర్ణయిస్తుంది.

చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 1976లో లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగింది. ఇది ఎమర్జెన్సీ కాలంలో ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం చేసిన చర్యగా ఆరోపణలు ఉన్నాయి. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇందిరా గాంధీ మెదక్ ఎంపీ స్థానం నుండి పోటీ చేసి గెలిచారు. 1971 సెన్సస్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీ జనాభా 16.58 లక్షలు (మొత్తం 4.35 కోట్లలో 3.81 శాతం) ఉండగా, 1976 చేర్పు తర్వాత 1981 సెన్సస్‌లో 31.76 లక్షలకు (5.35 కోట్లలో 5.93 శాతం) పెరిగింది. ఈ పెరుగుదలలో లంబాడీలు (బంజారాలు) 1112 లక్షల మంది ఉన్నారని అంచనా. 1971లో వారు బీసీ 'ఏ' గ్రూప్‌లో సంచార జాతులుగా ఉండగా, 1976 చేర్పు రాజకీయ ఒత్తిడి వల్ల జరిగిందన్న ఆరోపణలు లేకపోలేదు. లంబాడీలు ( బంజారాలు) మొఘల్‌బ్రిటిష్ కాలంలో సంచార వ్యాపారులుగా, రాజస్థాన్‌మహారాష్ట్ర నుండి వలసలు వచ్చారు. వారి సంస్కృతి, భాష (లంబాడీ రాజస్థానీ మిశ్రమం) పట్టణీకరణకు అనుగుణంగా మారింది, కానీ నిజమైన ఆదివాసీలు (గోండీ, కోయి భాషలు) దట్టమైన అడవులు, కొండల్లో ఒంటరిగా జీవిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో స్థిరపడిన లంబాడీల్ని అడవుల్లో నివసించే నిజమైన ఆదివాసీలతో కలపడం భావ్యం కాదని, ఇది ఎస్టీ గుర్తింపు స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆదివాసీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ చేర్పు వల్ల ఎస్టీ కోటాలో లంబాడీలు (బంజారాలు) విద్యా సంస్థల్లో ఎక్కువ శాతంలో సీట్లు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారు. మరోవైపు, ప్రాథమిక సదుపాయాలు లేకుండా ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారని, గిరిజన సంక్షేమ నిధులతో పాటు రాజకీయ అవకాశాలు కూడా ఎక్కువగా లంబాడీలకే వెళ్తున్నాయని వీరి ప్రధాన ఆరోపణ. 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు 6:1 మెజారిటీ తీర్పుతో ఎస్టీలో సబ్‌క్లాసిఫికేషన్‌ను చట్టబద్ధం చేసింది రాష్ట్రాలు అతి వెనుకబడిన తెగలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని చెప్పింది. ఈ తీర్పును తెలంగాణ ఆదివాసీలు స్వాగతించారు, కానీ అమలు జరగలేదు. మరోవైపు, తెలంగాణ మొదటి రాష్ట్రంగా 2025 ఏప్రిల్ 14న (అంబేద్కర్ జయంతి) ఎస్సీల సబ్‌క్లాసిఫికేషన్‌ను గెజిట్‌లో ప్రకటించింది. తెలంగాణ షెడ్యూల్డ్ కులాల (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) యాక్ట్, 2025 ప్రకారం, 59 ఎస్సీ సబ్‌కులాలను మూడు గ్రూపులుగా విభజించారు. మొత్తం 15% ఎస్సీ కోటాను ఈ విధంగా విభజించడం వల్ల అతి వెనుకబడిన ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఎస్టీలకు ఇలాంటి వర్గీకరణ ఇంకా జరగలేదు. ఆదివాసీ సంఘాలు లంబాడీల్ని ఎస్టీ జాబితా నుండి తొలగించాలి లేదా "ఎస్సీలకు చేసినట్టు ఎస్టీల్లో కూడా సబ్‌క్లాసిఫికేషన్ చేయాలి. అందులో నిజమైన ఆదివాసీలకు ఎక్కువ శాతం రిజర్వేషన్ కల్పించాలి " అని డిమాండ్ చేస్తున్నాయి.

రాజకీయంగా, ఈ వివాదం ఆదివాసీ , గిరిజన తెగలతో పాటు పార్టీల మధ్య ఘర్షణకు కారణమవుతోంది. సాంస్కృతికంగా, ఆదివాసీ భాషలు, సంప్రదాయాలు కనుమరుగవుతున్న విషయం తెలిసిందే. రాజ్యాంగం ప్రకారం, తెగలకు ప్రత్యేక గుర్తింపు ఉండాలి, మరియు రిజర్వేషన్ అతి వెనుకబడినవారికి మాత్రమే ఉండాలన్నది ఆదివాసీ నేతలు చెబుతున్న మాట. సుప్రీంకోర్టు విచారణ ఈ సమస్యకు కీలకం. దీని ఫలితం ఆధారంగా ఎస్టీ సబ్‌క్లాసిఫికేషన్ అమలు జరగవచ్చు, లేదా లంబాడీల రిజర్వేషన్ అంశంపై తీర్పు వెలువడే అవకాశం ఉంటుంది. ఎస్సీలకు జరిగినట్టు ఎస్టీలకు కూడా రాజ్యాంగ పరమైన రక్షణ చర్యలు తీసుకోకపోతే, ఆదివాసీల ఆకాంక్షలు నెరవేరవు. ఈ పోరాటం కేవలం రిజర్వేషన్ కోసం మాత్రమే కాదు, సామాజిక న్యాయం, సాంస్కృతిక రక్షణ కోసం. ప్రభుత్వాలు ఆలస్యం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలి, తద్వారా రాజ్యాంగ విలువలు కాపాడబడతాయి మరియు సామాజిక సంఘర్షణలు నివారించబడతాయి

**- యం.అర్జున్, హైదరాబాద్**



# ఆదివాసీ సంస్కృతిలో పెద్దల (కొత్తల) పండుగ ప్రత్యేకమైనది

**మహా :** ఆదివాసీ గుడాల్లో. ఆదివాసీల సంస్కృతి ఆచార సాంప్రదాయాలు ప్రకృతికి అనుబంధముగా జరుపుకునే పండుగను కొత్తల ( పెద్దల ) పండుగ అంటారు. సెప్టెంబర్ మాసంలో ఉత్తర కార్తె మొదటి పాదంలో అంటే ఈ నెల 13 వ తేదీన ఉత్తర కార్తె ప్రారంభం అవుతుంది బుధవారం, ( బెస్తా ) గురువారం లలో ఆదివాసీ ఆచార సాంప్రదాయాలతో పండుగను భక్తితో ప్రేమగా నిర్వహిస్తారు. బుధవారం ఉదయం ఇంటిల్లిపాది లేచి ఇల్లు, వాకిలీ శుద్ధి చేసుకొని తలంటి స్నానాలు చేసుకొంటారు. గ్రామ పెరమయ్య ( పూజారి ) డప్పు వాయిద్యాలతో ఇంటింటికి తిరిగి సళ్ళ, అంబలి జమ చేసుకొని ఊరి బయట దోరణ స్తంబాలు గ్రామానికి నాలుగు దిక్కులు పాతి, సళ్ళ, అంబలితో ఆరబోస్తారు. గ్రామ పొలిమేరల్లో బలి ఇచ్చుటకు పిల్లా పాపలతో వన బోజనాలకు వెళ్లి సంహపక్తి భోజనాలు చేస్తారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటి వేల్పులకు , కొత్త దాన్యాలు, సారా, కోడిపిల్ల, బలి ఇచ్చి, ఇంటిల్లిపాది సల్లంగా ఉండాలని దేవుళ్ళను మొక్కుతారు.

ఇంటిలో పెతర్లు (పెద్దల) పండుగను కొత్త దాన్యాలు, పాలు, చెక్కరతో పాయిసం చేసుకొంటారు. ఇంటిలో పెద్దలు చనిపోయిన సంబర్భంలో వాళ్ళు దేవతలుగా వుంటారు అని భావించి నైవేద్యం పెడుతారు, నూతన వదు వరులను తమ వంశీలకు పూర్తి స్థాయిలో హక్కులు కల్పించే విధంగా తల్లి కోడిని ఇంటి ఈశాన్యం దిక్కున మొగరానికి మొక్కుకొని ఆచార సాంప్రదాయబద్ధంగా ఇంటిలో ఎన్ని గుంబాలు ఉంటాయో అన్ని గుంబాల దగ్గర " ఇప్ప సారా " ను ఇప్పాకు డొప్పలో సమర్పిస్తారు. సారాయిని ఆరబోచి కోడిని గూబలకు అటు, ఇటు కొడుతూ, వద్దే సెలవు అడుగుతూ కోడిని కొట్టి చంపుతారు. కోడిమాంసం కూర అన్నం వండి వద్దే అనుమతి ( సెలవు ) తో వంశ సభ్యులందరికి (పెద్దలకు) ఆరగిస్తారు. శానార్తి ( సెలవు ) అనే పదంతో సెలవు అడిగి అందరు భోజనం చేస్తారు.

నూతనంగా పెళ్లి అయిన అమ్మాయి తన పుట్టింటివారి గొట్టు, గోత్రాలను విడిచి తన భర్త యొక్క గొట్టు, గోత్రాలలోకి మార్పిడి చెందుతుంది. అట్టి క్రమంలో తన తల్లి గారి ఇంటి ఆచార సంప్రదాయ వ్యవహారాలు ఏవి కూడా చెల్లవు. మరనాడు ఉదయం పెద్దలు పెతర్ల పేరుతో ఇంటి పని వాళ్లకు, ఇతరులకు అన్నదానం, వస్రదానం సమర్పించి గ్రామం లో ప్రజలు కొత్తల పండుగ అయిపోనట్లుగా ఆరోజు నుండి కొత్త పంటలను తినవచ్చు అని ఏకిభవిస్తారు. గుడాల్లో ఆదివాసులు అప్పటి వరకు పంట ను ముట్టుకోకుండా ఉండడం వారి ఆచారాలపై ఎంత నమ్మకం ఉంటుందో అర్థంచేసుకోవచ్చు. ఆదివాసులు అనాదిగా జరుపుకుంటున్న పండుగలలో కొత్తల పండుగ ప్రథమంగా జరుపుకుంటారు. నేటి నూతన టెక్నాలజీ కాలంలో సంప్రదాయాన్ని కాపాడుకోవడం గొప్ప విషయమే,

**- ముక్తి. సాంబశివరావు**

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**

mahaapatrika@gmail.com

whatsapp: 74369 39999

## బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

### ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్



**వరంగల్ మహా;** బాధితులు అందించే ఫిర్యాదుల పై పోలీస్ అధికారులు తక్షణమే స్పందించాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఐపీఎస్ గీసుగొండ పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా డీసీపీ అంకిత్ కుమార్ మంగళవారం గీసుగొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్ స్టేషన్ చేరుకున్న డిసీపికి మామునూరు ఏసిపి వెంకటేశం, స్థానిక ఇన్స్పెక్టర్ మహేందర్ పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. ఈ తనిఖీల్లో భాగంగా డిసీపి పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనీతీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని డిసీపి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను డిసీపి క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన డిసీబి సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిసీబి అంకిత్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీసుల పై నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలి. ప్రజల సమస్యలకు తక్షణ స్పందన తో పాటు, మర్యాద పూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. తనిఖీల అనంతరం డిసీబి చేతుల మీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.ఈ తనిఖీల్లో ఎస్ ఐలు కుమార్, అనిల్ పాల్గొన్నారు.

## బతుకమ్మ దసరా పండుగలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, మహా :** బతుకమ్మ, దసరా పండుగలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం నుండి ఈ నెల 21వ తేది నుండి అక్టోబర్ 2వ తేది వరకు జరుగనున్న బతుకమ్మ, దసరా సంబురాలపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, విద్యుత్తు, ఇరిగేషన్, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్, తహసీల్దార్లు,ఎంపీడీఓలు, ఎంపిఓలు, జిల్లా అధికారులతో ఐడిఓసి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ, దసరా చాలా పెద్ద పండుగలని తెలిపారు. పూలను బతుకమ్మలుగా పేర్చి ఆట, పాటలతో ఘనంగా జరుపుతారని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహిళలు బతుకమ్మలు ఆడిన తరువాత చెరువుల్లో నిమజ్జనం చేస్తారని, ఆయా ప్రాంతాలను గుర్తించి రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. బతుకమ్మ ఘాట్ల వద్ద విద్యుత్ సౌకర్యం, బారికేడ్లు, పోలీస్ బందోబస్తు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని తెలిపారు. ఏర్పాట్లుపై ఆయా శాఖల అధికారులు ముందుగానే బతుకమ్మ ఘాట్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. నిమజ్జనం చేసేందుకు లోతుగా వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. 20 వ తేది వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పండుగలు ప్రజల ఆచార సంప్రదాయాలకు ప్రతిబింబమని ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. చిన్నారులు, పెద్దలు అధికంగా పాల్గొనే ఈ పండుగల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పరి శుభ్రత, తాగునీటి సరఫరా, విద్యుత్, రవాణా, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులు కట్టుదిట్టమైన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులు స్థానిక స్థాయిలో పర్యవేక్షణ చేసి, సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, విద్యుత్తు ఎస్ ఈ మల్చూర్ నాయక్, ఇరిగేషన్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడివోలు, ఎంపీవోలు, సబ్ ఇన్స్పెక్టర్స్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్సీ

### కాంగ్రెస్ ప్రభుత్వంలో తీరనున్న పేదల సొంతింటి కల




**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని దూపకుంటలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అలాగే దేశాయి పేట్ లో గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల తో పాటు వరంగల్ రామ్ కిలో నూతన కలెక్టర్ కార్యాలయాన్ని కొండా మురళీధర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ నూతన కలెక్టర్ ఆఫీస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పేదల కల సహకారం అయ్యేలా అర్హులైన ప్రతి ఒక్కరికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలోనే పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. పేదవారి సొంటి కల నెరవేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని కొండా మురళి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమని కొండా మురళి తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన వరంగల్ ఎంపీ



**వరంగల్ మహా;** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హైదరాబాద్ లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట నూతన మల్టీ మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. ఈ బస్టాండ్ నిర్మాణం ద్వారా ప్రయాణీకులకు విశేష ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. భూపాలపల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు, భూపాలపల్లిని హసన్‌పర్తి రోడ్ లేదా భూపాలపల్లి జిల్లాకు దగ్గరగా ఉన్న ఉప్పల్, కమలాపూర్ రైల్వే స్టేషన్‌లకు అనుసంధానించే కొత్త రైల్వే లైన్ నిర్మాణంతో ప్రజా ప్రయోజనంతో పాటు ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇప్పటికే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మరోసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని సీఎం ను కోరారు. అలాగే నష్కల్ నుండి హసన్‌పర్తి, చింతల్‌పల్లి నుండి నష్కల్ వరకు రెండు కొత్త రైల్వే బైపాస్ లైన్లను ప్రతిపాదించారని, ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లు వరంగల్ మాస్టర్ ప్లాన్ 2041కి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం గానీ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కుడా గానీ స్థానిక ప్రతినిధులను సంప్రదించకుండానే తయారు చేయబడ్డాయని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రతిపాదనలను పునఃపరిశీలించడం ద్వారా ఓఆర్ఆర్ ను ఆనుకుని రైల్వే మౌలిక సదుపాయాలను ప్లాన్ చేయాలని, అప్పుడు రైతుల సమస్య తీరుతుందని, ట్రాఫిక్ సమస్య ఉండదని, వరంగల్ నగర ప్రణాళికతో పాటు అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ అంశంపై కూడా గతంలో కేంద్ర రైల్వే మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించినట్లు వెల్లడించారు. రైల్వే అలైన్మెంట్ మార్పు విషయం వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ సీఎం కు విజ్ఞప్తి చేసారు. వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఎంతో గొప్ప చారిత్రాత్మక దేవాలయాలైన శ్రీ భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల ఆలయం తో పాటు చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం యొక్క సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం సహకరించాలని, కేంద్ర ప్రభుత్వంతో వీలైనంత త్వరగా ఆలయాల అభివృద్ధిపై చర్చించి, అవసరమైన నిధులను త్వరగా మంజూరు చేసే విధంగా చూడాలని కోరారు. వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన దేవాలయాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని, అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కోటగుల్లు (ఘణపూర్ దేవాలయాన్ని), నాపాక, రెడ్డి గుడి దేవాలయాల పునరుద్ధరణను వేగవంతం చేయాలని సీఎం ను కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి వినతిపత్రం అందజేస్తామని తెలియజేసారు.

## ఇళ్ల జాబితాలో పేరు లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి 11 మంది నిరసన



**కాటారం, మహా :** మంథని నియోజకవర్గ పరిధిలోని ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ లో ఇందిరమ్మ ఇళ్ళ జాబితాపై గ్రామంలో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. ఇళ్ళ లిస్టులో పేరు లేకపోవడంతో నిరుత్సాహానికి గురైన అమ్రాబాద్ కు చెందిన 11 మంది గ్రామస్తులు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. మొదటి లిస్టులో తమ పేర్లు ఎంపిక చేసి తర్వాత లిస్టులో నుండి తమ పేర్లను తొలగించాలని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వచ్చి అర్హులమైన మాకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గ్రామస్తుల డిమాండ్ చేశారు. ఎనిమిది మంది మహిళలు ట్యాంక్ ఎక్కి రెండు గంటల పాటు ఆందోళన చేశారు. ఎంపీడీవో నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు.ఆన్లైన్లోనేమో మా పేర్లు వెళ్తున్నాయని, గ్రామపంచాయతీ లిస్టులో మాత్రం మా పేర్లను తొలగించారని నిరసనకారులు తెలిపారు. మేము నిరుపేదలం, కూలీ నాలి చేసుకుంటేనే రోజు గడుస్తదని మాలాంటి వాళ్ళ పొట్ట కొట్టకండి అని వేడుకున్నారు.

## సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమం

### పాల్గొన్న వరంగల్ పోలీస్ కమిషనర్



**హన్మకొండ మహా;** హన్మకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రధాన అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సీపీ సర్ డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, సైబర్ బానిసత్వం వంటి సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అప్రమత్తతతో ఉండి ఇలాంటి మోసాలకు బలిక కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి సుమారు 600 మంది విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు హాజరయ్యారు.

## షబ్బీర్ అలీకి ఘనస్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్, మహా :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోబుధవారం జరిగే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ మైనార్టీల శాఖల సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదిలాబాద్ కు చేరుకున్నారు. స్థానిక పెన్ గంగా అతిథి గృహం వద్ద ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ శ్రేణుల తో కలిసి పుష్ప గుచ్ఛమందించి ఘనస్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు.

## రేపు చిట్యాలలో స్వశక్తి పరివార్ అభియాన్ పథకం ప్రారంభం

**భూపాలపల్లిమహా:** స్వశక్తిపరివార్‌అభియాన్‌పథకం బుధవారం భూపాలపల్లి జిల్లాలని చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మధ్యాహ్నం ప్రారంభిస్తారని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు ప్రధానమంత్రి మాతృ వందన పథకం కింద ప్రసూతి ప్రయోజనాలను పంపిణీ చేయడం గురించి దేశ వ్యాప్తంగా వైద్య ఆరోగ్య క్యాంపుల నిర్వహణ 8 వ జాతీయ పోషణ మాస ప్రారంభం17 సెప్టెంబర్ నుండి 2 అక్టోబర్ 2025 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాల నిర్వహణ,మహిళా మరియు శిశుసంరక్షణ సేవలు,నమోదు కార్యక్రమాలు,మహిళా ఆరోగ్య సేవలు,అవగాహన మరియు ప్రవర్తనలో మార్పు,ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం ఇదే వికసిత భారతానికి ఆధారం. మహిళలు,పిల్లలు ఈ సేవలను పొందడానికి తమ సమీపంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సామాజిక ఆరోగ్య కేంద్రం లేదా అంగన్వాడి కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ పథకం బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభిస్తారని అందరూ తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ పిలుపునిచ్చారు.

## ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తుల ఆహ్వానం

### టాస్క్ ఆర్.సి. మేనేజర్ జి సాయికుమార్

**మంచిర్యాల, మహా :** తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్మెంట్ (టాస్క్) ద్వారా 4వ బ్యాచ్ ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ అందించడం కొరకు అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టాస్క్ ఆర్.సి. మేనేజర్ జి. సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి వారి ఉపాధి అవకాశాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు శిక్షణలో భాగంగా సి, సి++, హెచ్.టి.ఎం.ఎల్. అండ్ సి.ఎస్.ఎస్. జావా స్క్రిప్ట్, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్ (ఎ&ఆర్), ఇంటర్వ్యూ నైపుణ్యాలు, బూట్ స్ట్రాప్, వెబ్ డెవలప్మెంట్ కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాలనుండి 33 మధ్య వయస్సు ఉండాలని చెప్పారు. కంప్యూటర్ బ్యాక్ గ్రౌండ్ తో కూడిన డిగ్రీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమం అనంతరం నైపుణ్యత గల అభ్యర్థులకు ఉపాధి అవకాశానికి సహాయం అందించబడుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 20 నుండి 27 వరకు వారి వారి వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9502786438 నంబర్లో, ఆన్లైన్లో https://shorturl.at/z2m4H లో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## జిల్లా స్థాయి కృత్యమేలను సందర్శించిన జిల్లా కలెక్టర్

### సాంకేతిక విద్యతోనే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు



**వరంగల్ మహా;** జిల్లాస్థాయి కృత్యమేల ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేట ఆవరణలో మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి 13 మండల స్థాయిలో ఎంపిక కబ్బడి జిల్లా స్థాయికి వచ్చినటువంటి 130 టిఎల్ఎం లను పరిశీలించి తెలుసుకోవడం జరిగింది. ఒక్కొక్కటి ఎల్ఎం పాఠశాల స్థాయిలో ఏ విధంగా విద్యార్థులకు అమలు పరుస్తారో వాటి ద్వారా పిల్లల సామర్థ్యాలను ఏ విధంగా అభివృద్ధి పరుస్తారో ఉపాధ్యాయులతో చర్చించి సంతృప్తిని వ్యక్తపరచడం జరిగింది. అదేవిధంగా ఈ కృత్యాలను పాఠశాల స్థాయిలో అమలుపరిచి ప్రతి విద్యార్థి చదవడం, రాయడంలో ముందంజ లో ఉండేటట్టు కృషి చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, అకాడమిక్ మోనిటరింగ్ అధికారి శ్రీ యు సుజన్ తేజ సంయుక్తంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో అభ్యసన బోధనలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి విద్యార్థులలో సబ్జెక్టు కు సంబంధించిన సామర్థ్యాలను అలాగే అభ్యసన ఫలితాలు రాబట్టే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. మంగళవారం ప్రదర్శించిన కృత్యాల ద్వారా పిల్లలలో సామర్థ్యాలను సాధించడానికి సులువుగా ఉపయోగపడతాయని వీటిని తరగతి బోధనలో ఉపయోగించు కోవాలని సూచించారు. జిల్లాస్థాయి కృత్యమేళాలో 130 అంశాలు ప్రదర్శించగా అందులో నుండి ఎనిమిదింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరిగింది. అందులో భాగ్యలక్ష్మి జిపిఎస్ కరీమాబాద్, ఎం స్వాతి ఎంపీపీ ఎస్ రాయపర్తి, డి ఉమా కుమారి జిపిఎస్ కరిమాబాద్, ఎస్ భావన యుపిఎస్ పల్లార్ గూడ, సిహెచ్ రామకృష్ణ పిఎస్ స్వామి రావు పల్లి, ఎన్ రత్న సింధు యుపిఎస్ బాపూ నగర్, ఏ మౌనిక పిఎస్ మైలారం, సయ్యద్ అష్రఫ్ హుస్సేన్ వీరిని సర్టిఫికెట్, మెమెంటో తో డిఈఓ, ఏఎమ్ఓ, సత్కరించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిఎల్ఎం కన్వీనర్ కొర్ర సారయ్య, డిసీబీ కార్యదర్శి గారే కృష్ణమూర్తి, కిలా వరంగల్ ఎంఈఓ ప్రసాద్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదాబాయి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాపమ్మ, జ్యోతి, లక్ష్మయ్య, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు మరియు స్టేట్ రిసోర్స్ గ్రూప్ సభ్యులు చక్రవర్తుల శ్రీనివాస్, బండారు రమేష్, కృష్ణారెడ్డి, ఏవిఆర్ చార్యులు, డాక్టర్ బొమ్మెర కుమారస్వామి, తాబేలు శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

## లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసిన పోలీసులు

**వరంగల్ మహా;** తేదీ 15.09.2025 న Ap 07TH7030 నెంబరు గల లారీ డ్రైవర్ విజయవాడ గొల్లపూడి కి చెందిన వరగని దాసు తండ్రి పేరు రామస్వామి అనే వ్యక్తి మద్యం మత్తులో లారీని నడిపి వరంగల్ నగరంలోని ఆటోనగర్ నుండి ఎంజీఎం సర్కిల్ వైపు అతివేగంగా నడుపుకుంటూ ఎంజీఎం జంక్షన్ వద్ద అన్ లిమిటెడ్ షాపు ఎదురుగా ఉన్న డివైడర్ ను ఢీకొట్టగా ఆ డివైడర్ సుమారు మూడు మీటర్లు ధ్వంసం అయింది. కాగా డివైడర్ మధ్యలో ఉండే కరెంటు లైటింగ్ పోల్ పూర్తిగా విరిగిపోయింది. అంతేకాకుండా డివైడర్ అవతల ఉన్న విజయ తెలంగాణ డైరీ పార్లర్ ను కూడా ఢీకొట్టడంతో షాప్ లో ఉన్న రెండు ఫ్రిడ్జ్లు, డైరీ ప్రొడక్ట్స్ అన్ని ధ్వంసమయ్యాయి. ఇందుకు జిడబ్ల్యుఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ గనిపాక కంటేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని మట్టెవాడ పోలీసులు తెలిపారు.

## ఘనంగా ఎమ్మెల్యే వినోద్ పుట్టినరోజు వేడుకలు





**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ 69వ జన్మదిన వేడుకలను వెల్లంపల్లి కాంగ్రెస్ కార్యాలయంతో పాటు క్యాంపు కార్యాలయం లోనూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రోజు ఈ సందర్భంగా గడ్డం వినోద్ వెంకటస్వామి (ఎమ్మెల్యే బెల్లంపల్లి "69వ జన్మదిన వేడుకలను మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మత్తమారి సూరిబాబు,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ల ఆధ్వర్యంలో మరియు కాంగ్రెస్ పార్టీ అన్ని అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, మహిళా నాయకుల సమక్షంలోఅంగరంగ వైభవంగా చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలలో విశ్వాసం పెరుగుతుందని ,వీలైనంత తొందరగా ఇచ్చిన హామీలు అమలు చేస్తారని హర్షం వ్యక్తం చేశారు.

## కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ సందర్శన

### మేయర్ కార్పొరేటర్లు అధికారులు



**వరంగల్ మహా;** స్టడీ టూర్ లో భాగంగా ఇండోర్ లో పర్యటిస్తున్న మేయర్ కార్పొరేటర్లు అధికారుల బృందం మంగళవారం ఇండోర్ లో సుమారు 15 ఎకరాల్లో నిర్మించిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ యూనిట్లను నగర మేయర్ గుండు సుధారాణి కార్పొరేటర్ లు అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భం గా ప్లాంట్ ను పర్యవేక్షిస్తున్న అక్కడి అధికారులు ప్లాంట్ నిర్వహణ తీరును తెలియజేస్తూ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ (సి బి పి) యందు 550 టన్నుల తడి చెత్తను పిపిపి మోడ్ ద్వారా కంప్రెస్డ్ బయో గ్యాస్ (సిబిజి) గా మార్చడం జరుగుతుందని, దాదాపు ప్రతిరోజు 17 వేల కిలోల బయో గ్యాస్ ఉత్పత్తి అవుతుందని, 15 ఎకరాల్లో ప్లాంటును ఏర్పాటు చేసి సేకరించిన తడి చెత్త ను వివిధ రకాల పద్ధతుల ద్వారా బయోగ్యాస్ గా మార్చి ఉత్పతి చేసిన గ్యాస్ ను వారి యొక్క రవాణా వాహనాలకు, పరిశ్రమలకు, గృహాల వినియోగానికి పంపించడం జరుగుతుందని బయోగ్యాస్ అనంతరం మిగిలిపోయిన చెత్త (సాలిడ్ వేస్ట్) ను కంపోస్ట్ గా మార్చి అట్టి ఎరువును కూడా విక్రయించడం జరుగుతుందని ప్లాంట్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్ షమీమ్, వివిధ డివిజన్ లకు చెందిన కార్పొరేటర్ లు సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, ఇంచార్జి ఎస్ ఈ సిటీ ప్లానర్ లు మహేందర్, రవీంద్ర రాడేకర్, డి ఎఫ్ ఓ శంకర్ లింగం పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ నిర్వహణకు పగడ్బంది ఏర్పాట్లు

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్




**వరంగల్ మహా;** రాబోయే బతుకమ్మ పండుగ నిర్వహణకు పగడ్బంది ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఇంజనీరింగ్ సానిటేషన్ అధికారులతో బతుకమ్మ ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్ల పై ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఈసందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ బల్దియా పరిధి లోని హన్మకొండ లో 26 ప్రాంతాల్లో వరంగల్ పరిధి లో 20 ప్రాంతాలను బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడానికి ఇప్పటికే గుర్తించడం జరిగిందని ఆయా ప్రాంతాల్లో శానిటేషన్ లో భాగం గా బతుకమ్మ ఆడుకునే ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం తో పాటు విద్యుత్ లైటింగ్ ఏర్పాట్లు చేయాలని బుధవారం నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవం (తెలంగాణ విమోచన దినం) సందర్భం గా బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణ లో మేయర్ జెండా ను ఎగురవేస్తారని అందుకు అనుగుణం గా విస్తృత ఏర్పాట్లు చేయాలని కమిషనర్ అన్నారు.


**వెయ్యి స్థంభాల ఆలయంలో పరిశీలన**

హన్మకొండ లోని ప్రసిద్ధ వెయ్యి స్థంభాల ఆలయం లో కమిషనర్ కుడా బల్దియా అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి ఈనెల 21 న ఆలయం లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల కు చేపట్టాల్సిన ఏర్పాట్లను అధికారులతో చర్చించిన కమిషనర్ తగు సూచనలు చేస్తూ బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి నీటి వసతి తో పాటు సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా సి పి ఓ అజిత్ రెడ్డి, బల్దియా కుడా ఈ ఈ లు రవి కుమార్ భీమ్ రావు డి ఈ లు సారంగం సతీష్ సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్ ఏ ఈ లు సానిటరీ ఇన్స్పెక్టర్ లు పాల్గొన్నారు.

## సిఈఆర్ క్లబ్ లో ఆయుర్వేద వైద్య శిబిరము

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్, హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో మంగళవారం రోజున గోలేటి టౌన్ షిప్ లోని సి.ఈ.ఆర్. క్లబ్ లో ఆయుర్వేద వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. ఉద్యోగులు, గ్రామస్తులను పరీక్షించి దీర్ఘకాలిక వ్యాదులైన కీళ్ళ, మోకాళ్ళ నొప్పులు, బి.పి. షుగర్, పక్షవాతము, అజీర్ణము, మలబద్ధకము, అస్తమా, స్త్రీల వ్యాధులు మొదలగు వాటికి మందులు అందజేశారు. ఉద్యోగులు, గ్రామస్తులు వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవడం తో పర్సనల్ డిపార్ట్ మెంట్ హెచ్ ఓ డి ఎం శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



మంగళవారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాలను చవిచూశాయి. సెన్సెక్స్ 594.95 పాయింట్లు లేదా 0.73 శాతం లాభంతో.. 82,380.69 వద్ద, నిఫ్టీ 169.90 పాయింట్లు లేదా 0.68 శాతం లాభంతో 25,239.10 వద్ద నిలిచాయి. టాప్ గెయినర్స్ జాబితాలో.. కొఠారి ప్రొడక్షన్, రవీందర్ హైట్స్, రెడింగ్టన్, లక్ష్మీ డెంటల్, పావ్నా ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు చేరాయి. శ్రద్ధ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, జేఐటీఎఫ్ ఇన్‌ఫ్రాలాజిస్టిక్స్, ఎల్ఈ ట్రావెన్యూస్ టెక్నాలజీ, మాగ్నమ్ వెంచర్స్, థెమిస్ మెడికేర్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయి.

# అనురాగ్ యూనివర్శిటీ, ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ మధ్య ఒప్పందం




అనురాగ్ యూనివర్సిటీ, ప్రముఖ ఫార్మా కంపెనీ అయిన ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందాన్ని (MoU) కుదుర్చుకుంది. ఈ సహకారంలో భాగంగా.. ఎంఎస్ఎన్ ఉద్యోగుల కోసం అనురాగ్ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగం, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఒక ప్రత్యేకమైన బ్రిడ్జ్ కోర్సు (MSN Labs Bridge Course) నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం జ్యోతి ప్రజ్వలన, అతిథుల స్వాగతంతో ప్రారంభమైంది. అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ హెడ్, కార్యక్రమ కోఆర్డినేటర్ అయిన డాక్టర్ సవితా బెల్వాల్, సెల్ఫ్‌డైరెక్టెడ్ టీమ్స్ (SDT) బ్రిడ్జ్ కోర్సు గురించి వివరించారు. ఈ కోర్సును MSN ల్యాబ్స్‌తో కలిసి ఉద్యోగుల జ్ఞానం, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే ధ్యేయంగా రూపొందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సవితా బెల్వాల్ మాట్లాడుతూ.. "ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్‌తో కుదుర్చుకున్న ఈ అవగాహన ఒప్పందం పరిశ్రమవిద్యాసంస్థల సహకారానికి ఒక బలమైన ఉదాహరణ. ఈ బ్రిడ్జ్ కోర్సు ద్వారా, మేము శిక్షణ పొందుతున్నవారికి సైద్ధాంతిక పరిజ్ఞానంతో పాటు, ఆచరణాత్మక నైపుణ్యాలను కూడా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తద్వారా వారు పరిశ్రమ అవసరాలకు సిద్ధమయ్యేలా, ఆత్మవిశ్వాసంతో ఉండేలా తీర్చిదిద్దుతాం. ఫార్మా రంగంలోని వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి పరిశ్రమ, విద్యాసంస్థలు నిరంతరం ఒకదాని నుంచి మరొకటి నేర్చుకునే నమూనాను సృష్టించడమే మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ కీలక పాత్ర పోషిస్తుంది. పరిశ్రమకు సంబంధించిన శిక్షణా మాడ్యూళ్లను రూపొందించడం, లెక్చర్లు, ల్యాబొరేటరీ సెషన్లను నిర్వహించడం, శిక్షణ పొందుతున్నవారి పురోగతిని, మూల్యాంకనాలను పర్యవేక్షించడం వంటివి చేస్తుంది. ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ హెచ్‌ఆర్ (ఏపీఐ) హెడ్ అయిన కె. ఎల్. ఎన్. మూర్తి మాట్లాడుతూ.. "భారతదేశంలో ఫార్మా ప్రతిభను అభివృద్ధి చేయడానికి అనురాగ్ యూనివర్శిటీ వంటి ప్రముఖ విద్యాసంస్థతో భాగస్వామ్యం అవసరం అని మేము బలంగా భావించాం. ఈ సహకారం మా నూతన ఉద్యోగులు సరైన సైంటిఫిక్ పరిజ్ఞానం, ఆచరణాత్మక శిక్షణ, సమస్యల్ని పరిష్కరించే నైపుణ్యాలతో తమ వృత్తి జీవితంలో సులభంగా ముందుకు సాగడానికి సహాయపడుతుంది. ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని మనం కలిసి తయారు చేస్తున్నాం" అని పేర్కొన్నారు. అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్, పరీక్షల విభాగం, విద్యార్థి వ్యవహారాల డీన్స్‌తోపాటు ఎల్ అండ్ డీ (లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్) డైరెక్టర్ అయిన జావిద్ జమాల్ సమావేశంలో ప్రసంగించారు. పరిశ్రమకు సిద్ధంగా ఉండే నిపుణులను తయారు చేయడంలో విద్యాపరమైన తోడ్పాటు ఎంత ముఖ్యమో వారు తమ ప్రసంగంలో నొక్కి చెప్పారు. ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్‌తో కుదుర్చుకున్న ఈ అవగాహన ఒప్పందం ఫార్మా రంగంలో అనురాగ్ యూనివర్శిటీకి రెండో ముఖ్యమైన సహకారం. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాలు, పరిశ్రమవిద్యాసంస్థల మధ్య దీర్ఘకాలిక సమన్వయాన్ని పెంపొందించడానికి యూనివర్శిటీ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తాయి. ఇవి విద్యార్థులకు, శిక్షణ పొందుతున్నవారికి ఆచరణాత్మక నైపుణ్యాలు, అనుభవం, ఫార్మా కెరీర్‌లలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయి.

# 2025 నాటికి రెండు కోట్ల వాహనాలు

## సీపీసీబీ అంచనా

నిర్దిష్ట వయసు దాటిన వాహనాలను ప్రజా రహదారులపై నడపడం నిషిద్ధం. ఇలాంటి వాహనాలను స్క్రాపేజ్ సెంటర్లకు తరలించాలని ప్రభుత్వం పలుమార్లు వెల్లడించింది. దీనికోసం స్క్రాపేజ్ సెంటర్లు కూడా పుట్టాయి. ఈ సెంటర్లలో పాత వాహనాలను తుక్కు చేసి.. రీసైక్లింగ్ చేస్తారు. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. భారతదేశంలో 20 ఏళ్లు పైబడిన లైట్ వెయిట్ మోటర్ వాహనాలు 51 లక్షలు, 15 ఏళ్లు పైబడినవి 34 లక్షలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా.. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) అంచనాల ప్రకారం.. 2025 నాటికి దేశవ్యాప్తంగా 2 కోట్ల పైచిలుకు వాహనాల జీవితకాలం ముగియనుంది. వీటన్నింటిని అలాగే వదిలేస్తే.. అవి మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడం మాత్రమే కాకుండా.. గాలి, నీరు, మట్టిని కూడా కాలుష్యం చేస్తాయి. కాబట్టి వీటన్నింటినీ రీసైక్లింగ్ చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 60 రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ సౌకర్యాలు.. 75 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో స్క్రాపింగ్ విధానం సవ్యంగా అమలు కావడానికి.. ప్రభుత్వం జీఎస్టీ తగ్గించింది. దీంతో స్క్రాప్ కొనుగోలు చేసే కంపెనీలు చెల్లించాల్సిన జీఎస్టీ తగ్గింది. ఇది రీప్లేస్‌మెంట్ వ్యయాల భారాన్ని తగ్గించేందుకు, పర్యావరణహితమైన విధానాలను ప్రోత్సహించేందుకు తోడ్పడుతుంది.



భారత్‌లోనే అతి పెద్ద రీసైక్లింగ్ వ్యవస్థ

ఆసియాలోనే అగ్రగామి సర్క్యులర్ ఎకానమీ, సస్టైనబిలిటీ సొల్యూషన్స్ సంస్థ రీ సస్టైనబిలిటీ లిమిటెడ్ (ఆర్ఈఎస్ఎల్) రీ కర్మ (Re Carma), భారత్‌లోనే అతి పెద్ద ఎండ్‌ఆఫ్‌లైఫ్ వెహికల్ (ఈఎల్‌వీ) రీసైక్లింగ్ వ్యవస్థగా ఆవిర్భవించింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ ఝజ్జర్‌లోని రిలయన్స్ మోడల్ ఎకనమిక్ టౌన్‌షిప్‌లో గల రీ కార్మ ఫ్లాగ్‌షిప్ అధునాతన కేంద్రం ఏడాదికి 30,000 కంటే ఎక్కువ వాహనాలను (ప్యాసింజర్ కార్లు, వాణిజ్య వాహనాలు, ఎర్త్‌మూవింగ్ ఎక్విప్‌మెంట్ మొదలైనవి) తుక్కు చేస్తోంది. ఈ హబ్ కాకుండా, రీ కర్మ దేశవ్యాప్తంగా తమ ఫ్రాంచైజీ, భాగస్వాముల నెట్‌వర్క్ ద్వారా కార్యకలాపాలు సాగిస్తోంది.

# నేను ముందే ఊహించాను!

## బంగారం ధరలపై క్రిస్టోఫర్ వుడ్

డాలర్ విలువ తగ్గినప్పుడు బంగారం, బిట్‌కాయిన్ రెండింటిపైన పెట్టుబడులు పెరుగుతాయని, మార్కెట్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని.. జెఫరీస్ గ్లోబల్ హెడ్ ఆఫ్ ఈక్విటీ స్ట్రాటజీ 'క్రిస్టోఫర్ వుడ్' పేర్కొన్నారు. గుర్గావ్‌లోని జెఫరీస్ ఇండియా ఫోరమ్‌లో మాట్లాడుతూ.. తన పోర్ట్‌ఫోలియో కేటాయింపులను కూడా వెల్లడించారు. ప్రస్తుతం పసిడి ధరలు జీవితకాల గరిష్టాలను చేరుకున్నాయి. బంగారం ఔన్సుకు 3,698 డాలర్లకు పెరిగిన సమయంలో.. భారతదేశంలో కూడా 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1.11 లక్షలు దాటేసింది. ఔన్స్ బంగారం 3600 డాలర్లకు చేరుతుందని.. నేను 2002లోనే అనుకున్నాను. ఊహించినట్లుగానే గోల్డ్ ఆ లక్ష్యాన్ని చేరుకుందని క్రిస్టోఫర్ వుడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం గోల్డ్ కొత్త ట్రేడింగ్ శ్రేణిలోకి ప్రవేశించినట్లు కనిపిస్తోందని ఆయన స్పష్టం చేశారు. బంగారం (ఫిజికల్ గోల్డ్)పై ఆశ ఉన్నప్పటికీ.. నాకు గోల్డ్ మైనింగ్ స్టాక్‌లనే ఆసక్తి ఉందని



అన్నారు. అయితే ఇది మొత్తం కంపెనీల లాభాల మీద ఆధారపడి ఉంటుంది. బిట్‌కాయిన్‌ల విలువ కూడా భారీగా పెరుగుతోంది. నేను బంగారం & బిట్‌కాయిన్ రెండింటినీ సొంతం చేసుకోవాలనుకుంటున్నాను. ఎందుకంటే ఎక్కువ మంది ధనవంతులు బంగారాన్ని కొనుగోలు చేయకపోవచ్చు. వారంతా బిట్‌కాయిన్‌ను కొనుగోలు చేస్తారు. రాబోయే కాలం మొత్తం బిట్‌కాయిన్, బంగారంతోనే ముడిపడి ఉందని క్రిస్టోఫర్ వుడ్ పేర్కొన్నారు.



# ఇండస్ టవర్స్, ఐఐటీ మద్రాస్ మధ్య భాగస్వామ్యం

ప్రపంచంలోని అతిపెద్ద టెలికాం టవర్ కంపెనీలలో ఒకటైన ఇండస్ టవర్స్, గ్లాస్ ఫైబర్ రీన్‌ఫోర్స్డ్ పాలిమర్పై పరిశోధన చేయడానికి ఐఐటీ మద్రాస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో ఉక్కుకు స్థిరమైన, మన్నికైన.. ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ భాగస్వామ్యంలో ఐఐటీ మద్రాస్ మెకానికల్ స్ట్రెంత్, మన్నిక, లైఫ్ సైకిల్ వంటి వాటిని అధ్యయనం చేస్తుంది. అంతే కాకుండా టెలికాం, ఇతర పరిశ్రమల కోసం డిజైన్.. భద్రతా ప్రమాణాలను సృష్టిస్తుంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో అనిల్ గుప్తా (ఇండస్ టవర్స్), ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు రవీంద్ర గెట్టు, అశ్విన్ మహాలింగం పాల్గొన్నారు.





# ఆమె ఇంట నోట్ల కట్టలు.. కేజీల కొద్దీ బంగారం!!





ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అస్సాం సివిల్ సర్వీస్ అధికారిణి నుపూర్ బోరాను సోమవారం అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ఆమె నివాసం నుంచి కిలోల కొద్దీ బంగారం, లక్షల రూపాయల విలువున్న నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. అంతేకాదు.. ఆ సమయంలో నోట్ల కట్టలను అధికారులు మెషిన్లతో లెక్కిస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. భారీ అవినీతి ఆరోపణల నడుమ.. చీఫ్‌మినిస్టర్ స్పెషల్ విజిలెన్స్ సెల్ బృందం సోమవారం గువాహతిలోని నుపూర్ బోరా(28) నివాసంలో తనిఖీలు నిర్వహించింది. అయితే అధికారికంగా రూ.92 లక్షలు విలువ చేసే నగదు, కోటి రూపాయల విలువ చేసే నగలను సీజ్ చేశారు. అలాగే.. బార్‌పేటలో ఉన్న అద్దె నివాసం నుంచి మరో రూ.10 లక్షల విలువైన నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆపై ఆమెను అరెస్ట్ చేసి అవినీతి భాగోతం మీద ప్రశ్నిస్తున్నట్లు ప్రకటించింది. గోలాఘట్‌కు చెందిన నుపూర్ బోరా.. 2019లో అస్సాం సివిల్స్ సర్వీస్‌కు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆమె గోరోయిమరి జిల్లా కంరూప్‌లో సర్కిల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బోరా తన పదవిలో ఉండగా హిందూ భూములను 'సందేహాస్పద వ్యక్తులకు' డబ్బు కోసం బదిలీ చేశారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అంటున్నారు. ఇక.. నుపూర్ సహాయకుడిగా పనిచేసిన లాట్ మండల్ సురజిత్ దేకాని కూడా అధికారులు విచారణ జరుపుతున్నారు. బార్‌పేట జిల్లాలో అనేక భూములు అక్రమంగా పొందినట్లు ఆరోపణలు ఈయనపై ఉన్నాయి. నుపూర్ కేసులో తనిఖీలు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. మరోపక్క.. కేఎంఎస్ఎస్ అనే స్థానిక ఉద్యమ సంస్థ ఒకటి కూడా ఆమె అవినీతి భాగోతంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఆమెపై వస్తున్న భూ సంబంధిత ఆరోపణల నేపథ్యంలో గత ఆరు నెలలుగా నిఘా ఉంచినట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. బార్‌పేట రెవెన్యూ సర్కిల్‌లో ఆమె విధుల్లో ఉన్నప్పుడు లంచం తీసుకుని హిందూ ఆలయాల భూములను ఇతరుల పేరిట బదిలీ చేసినట్లు అభియోగాలు ఉన్నాయి. మైనారిటీల జనాభా అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ తరహా అవినీతి కార్యకలాపాలు ఎక్కువగా నమోదవుతున్నాయి అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో తీవ్ర దుమారం చెలరేగింది. అస్సాంలో అవినీతి రహిత పాలన పేరిట సీఎం స్పెషల్ విజిలెన్స్ సెల్‌ను 2021లో హిమంత బిశ్వ శర్మ ప్రారంభించారు. అధికారుల అక్రమ ఆస్తులపై దాడులు, అవినీతి సంబంధిత కేసుల విచారణ, సున్నితమైన భూమి బదిలీ వ్యవహారాలపై నిఘా.. తదితర అంశాలను ఈ విభాగం చూసుకుంటుంది.





# ట్రంప్ మరో హెచ్చరిక: ఇక కార్టెల్స్ పై ఉచ్చు బిగిస్తాం..

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండవ దఫా అధికారం చేపట్టినది మొదలు తన పాలనలో వినూత్న మార్పులు తీసుకువస్తున్నారు. తాజాగా వెనిజులా నుండి మాదకద్రవ్యాలను తీసుకువెళుతున్నట్లు భావిస్తున్న పడవను లక్ష్యంగా చేసుకుని, అమెరికా సైన్యం దాడి చేసిందని అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఆ నౌకలో ముగ్గురు మృతిచెందారని, ఈ తరహా 'కార్టెల్స్'ను లక్ష్యంగా చేసుకుని సైనిక దాడులు మరింతగా విస్తరిస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఉగ్రవాదులు అంతర్జాతీయ జలాల్లో అక్రమ మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్నప్పుడు ఈ దాడి జరిగిందని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ఏర్పడిన 'కార్టెల్స్' అమెరికా జాతీయ భద్రత, విదేశాంగ విధానం, కీలకమైన అమెరికా ప్రయోజనాలకు ముప్పు కలిగిస్తున్నాయన్నారు.

ఇటీవల అమెరికా సైన్యం వెనిజులా నుండి మాదకద్రవ్యాలను తీసుకువెళుతున్న స్పీడ్‌బోట్‌పై దాడి చేసింది. ఈ ఘటనలో 11 మంది మృతిచెందారు. తాజాగా ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ తమ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కెయిన్ తాజా 'కార్టెల్స్' దాడికి సంబంధించిన ఫుటేజ్ చూపించినట్లు తెలిపారు. ఆ నౌకలో మాదకద్రవ్యాలున్నాయని అమెరికా దగ్గర ఎలాంటి రుజువు ఉందని విలేకరులు అడగగా ట్రంప్ 'మా దగ్గర రుజువు ఉంది. మీరు చేయాల్సిందల్లా సముద్రం అంతటా చెల్లాచెదురుగా ఉన్న సరుకును గమనించడమే.. పెద్ద సంచుల కొకైన్, ఫెంటానిల్ అక్రమ రవాణా జరుగుతోంది. సముద్రంలో మాదకద్రవ్యాల స్మగ్లర్లపై ఎలా దాడులు జరుగుతున్నాయో అవి భూభాగంపైన కూడా కొనసాగుతాయని ట్రంప్ పేర్కొన్నారు.

# అక్టోబర్ 1 నుంచి రైల్వే శాఖ కొత్త రిజర్వేషన్ విధానం

## మొదటి 15 నిమిషాలు.. ఆధార్ ధ్రువీకరణ ఉన్నవారికే

**న్యూఢిల్లీ:** జనరల్ టిక్కెట్ల రిజర్వేషన్‌కు బుక్కింగ్స్ మొదలైన మొదటి 15 నిమిషాలను ఆధార్ ధ్రువీకరణ ఉన్న యూజర్లను మాత్రమే అనుమతిస్తామని రైల్వే శాఖ తెలిపింది. రైలు ఏదైనా బుక్కింగ్స్ ప్రారంభమైన మొదటి 15 నిమిషాల్లో ఐఆర్‌సీటీసీ (IRCTC) వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా రిజర్వేషన్ చేయించుకునే టిక్కెట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టత నిచ్చింది. పదిహేను నిమిషాల తర్వాత మాత్రమే అధీకృత ఏజెంట్లు టిక్కెట్లు రిజర్వేషన్ తీసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. 'ఉదాహరణకు ఒక రైలు ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు బయలుదేరనుంది. ఆ రైలుకు రిజర్వేషన్లు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైతే, మొదటి 15 నిమిషాలు ఆధార్ ధ్రువీకరణ ఉన్న వారికే రిజర్వేషన్ చేసుకునే అవకాశముంటుంది' అని వివరించింది. ఇప్పటి వరకు తత్కాల్ (Tatkal) రిజర్వేషన్లకు మాత్రమే ఈ నిబంధన





ఉండేది. రిజర్వేషన్ విధానం ప్రయోజనాలు సాధారణ వినియోగదారునికి కూడా అందేందుకు, దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు కొత్త విధానాన్ని తీసుకువచ్చినట్లు రైల్వే శాఖ సోమవారం ఒక సర్క్యులర్‌లో వివరించింది. కౌంటర్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునే ఏజెంట్లకు ప్రస్తుతమున్న మొదటి 10 నిమిషాల నియంత్రణ కొనసాగుతుందని కూడా స్పష్టం చేసింది.


# మసూద్ అజార్ కుటుంబం ముక్కలైంది..

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబం తునాతునకలైనట్లు పాకిస్తాన్ జైషే మహమ్మద్ కమాండర్ ఓ బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. తాజాగా, పాకిస్తాన్‌లో జరిగిన ఓ సమావేశంలోని వీడియో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కాశ్మీరీ భారత బలగాలు వారి రహస్య స్థావరంలోకి చొరబడి వారిపై ఎలా దాడి చేశాయో వివరించాడు. ఉర్దూలో కాశ్మీరీ మాట్లాడుతూ.. 'ఉగ్రవాదాన్ని స్వీకరించి, ఈ దేశ సరిహద్దులను కాపాడటం కోసం మేము ఢిల్లీ, కాబూల్, కాందహార్‌లతో పోరాడాం. సర్వస్వం త్యాగం చేశాం. కానీ మే 7న బహవల్‌పూర్‌లో భారత బలగాలు మౌలానా మసూద్ అజార్ కుటుంబాన్ని ముక్కలు చేశాయి' అని ఆవేశంతో ఊగిపోతూ మాట్లాడాడు. జమ్మూకశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్





ప్రాంతంలో ఏప్రిల్ 22 మధ్యాహ్నం పర్యాటకులపై ఉగ్ర ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 26మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, పహల్గాం ఉగ్రదాడికి భారత్ బదులు తీర్చుకుంది. లష్కరే తోయిబా, జైషే ఉగ్రముఠాలే లక్ష్యంగా వాటి స్థావరాలపై బాంబులతో విరుచుకుపడింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిపిన మెరుపుదాడులతో ఈ ఉగ్రసంస్థలకు గట్టి దెబ్బ తగిలింది. ముఖ్యంగా బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రాన్ని నేలమట్టం చేసింది. ఆపరేషన్ సిందూర్‌తో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని 10 మందితో పాటు అతడి మరో నలుగురు అనుచరులు మృతి చెందారు. వారితో పాటు జైషే నెంబర్2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. దాదాపు 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఆపరేషన్ సిందూర్ దెబ్బకు బహవల్‌పూర్‌లోని జైషే ఉగ్రస్థావరాలు చిన్నాభిన్నమయ్యాయి. వాటిని పునర్‌నిర్మించుకునేందుకు పాక్ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారీ ఎత్తున నిధులు కూడా కేటాయించింది. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్‌లో భారత బలగాలు పీవోకే, పాకిస్తాన్‌లో ఎంతటి బీభత్సం సృష్టించాయో జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కాశ్మీరీ వివరించడం చర్చాంశనీయంగా మారింది.



# ఓజీ టీమ్ ప్లాన్ మార్చిందా?

ఈ నెలలో టాలీవుడ్ నుంచి రాబోతున్న బడా మూవీ 'ఓజీ'. పవన్ కల్యాణ్-సుజీత్ కాంబోలో తీసిన ఈ సినిమాపై ఓ మాదిరి అంచనాలు అయితే ఉన్నాయి. అయితే గ్లింప్స్, తొలి పాటతో హై తీసుకొచ్చారు గానీ తర్వాత వచ్చిన సాంగ్స్ మాత్రం ఓ మాదిరిగానే ఉన్నాయి. ప్రస్తుతానికైతే పవన్ అభిమానులు ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు వాళ్లకు ఓ బ్యాడ్ న్యూస్ అని తెలుస్తోంది. రీసెంట్ టైంలో పెద్ద సినిమాలకు ప్రీమియర్లు వేస్తున్నారు. అంతెందుకు పవన్ గత చిత్రం 'హరిహర వీరమల్లు'కి కూడా రిలీజ్ ముందురోజు రాత్రి షోలు వేశారు. కానీ కంటెంట్ తీసికట్టుగా ఉండటంతో మూవీ ఫలితం బెడిసికొట్టింది. దీంతో పోలిస్తే 'ఓజీ'పై హైప్ ఉంది. అందుకు తగ్గట్లే ఈ సినిమాకు కూడా ముందు రోజు సాయంత్రం నుంచి ప్రీమియర్లు ఉండొచ్చని కొన్నిరోజుల క్రితం టాక్ వినిపించింది. కానీ ఇప్పుడవి లేవని అంటున్నారు. అర్ధరాత్రి ఒంటి గంటకు లేదంటే వేకువజామున 4 గంటల నుంచే తెలుగు రాష్ట్రాల్లో షోలు పడొచ్చని టాక్. ఈ మేరకు డిస్ట్రిబ్యూటర్స్ కు సమాచారం వెళ్లినట్లు తెలుస్తోంది. 1980-90లో ముంబై బ్యాక్ డ్రాప్‌లో నడిచే గ్యాంగ్‌స్టర్ డ్రామాగా 'ఓజీ'ని తెరకెక్కించారు. పవన్ సరసన ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా చేసింది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్ పాత్రలో కనిపించబోతున్నాడు. తమన్ సంగీతమందించాడు. డీవీవీ దానయ్య నిర్మాత.



# పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన జాన్వీ!

ఇటీవలే పరమ్ సుందరితో అభిమానులను అలరించిన బాలీవుడ్ ముద్దుగుమ్మ జాన్వీ కపూర్. అంతలోనే మరో మూవీతో అలరించేందుకు సిద్ధమైంది. సన్నీ సంస్కారి కీ తులసి కుమారి అనే సినిమాలో హీరోయిన్‌గా కనిపించనుంది. వరుణ్ ధావన్ హీరోగా వస్తోన్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు జాన్వీ కపూర్ కూడా హాజరైంది. ఈ సందర్భంగా జాన్వీ కపూర్‌కు తన పెళ్లి గురించి మరోసారి ప్రశ్న ఎదురైంది. ఈ ప్రశ్నకు జాన్వీ కపూర్ స్పందించారు. ప్రస్తుతానికి తనకైతే పెళ్లి చేసుకునే ఆలోచన లేదని చెప్పింది. ఇప్పుడు నా దృష్టి కేవలం సినిమాలపైనే ఉందని తెలిపింది. వివాహానికి ఇంకా చాలా సమయం ఉందని వెల్లడించింది. దీంతో తనపై వస్తున్న మ్యారేజ్ రూమర్స్‌కు చెక్ పెట్టింది ముద్దుగుమ్మ. అయితే గతంలో ఆమె.. శిఖర్ పహారియాను పెళ్లి చేసుకోనున్నట్లు వార్తలొచ్చాయి. ఎందుకంటే వీరిద్దరు చాలాసార్లు జంటగా కనిపించడంతో రూమర్స్ వినిపించాయి. గత ఇంటర్వ్యూలో తన ఫోన్‌లో స్పీడ్ డయల్ లిస్ట్‌లో బోనీ కపూర్, ఖుషీ కపూర్‌తో పాటు శిఖర్ పేరును కూడా చెప్పడంతో డేటింగ్ రూమర్స్ మొదలయ్యాయి. కాగా.. శిఖర్ పహారియా మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు అన్న సంగతి తెలిసిందే. మరోవైపు ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉన్న జాన్వీ కపూర్.. టాలీవుడ్‌లో రామ్ చరణ్ సరసన పెద్దిలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీకి బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది.



# కత్రినా కైఫ్ గుడ్ న్యూస్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ గురించి పరిచయం అక్కర్లేదు. తనకంటే వయసులో చిన్నవాడైన విక్కీ కౌశల్‌ను పెళ్లాడింది. 2021లో వీరిద్దరు వివాహం బంధంలోకి అడుగుపెట్టారు. అప్పటి నుంచి ఈ జంటపై రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. కత్రినా గర్భంతో ఉన్నారని చాలాసార్లు కథనాలొచ్చాయి. దీనిపై ఇప్పటివరకు ఎవరూ కూడా స్పందించలేదు.

అయితే ఈసారి ఏకంగా ఈ జంటపై మరో ప్రచారం మొదలైంది. వచ్చేనెలలోనే కత్రినా కైఫ్ బిడ్డకు జన్మనివ్వబోతున్నారని టాక్ నడుస్తోంది. వచ్చే నెల అంటే అక్టోబర్‌లో అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పనున్నారని సోషల్ మీడియాలో వైరలవుతోంది. ప్రస్తుతం ఆమె మూడో త్రైమాసికంలో ఉన్నారని.. వచ్చేనెల లేదా నవంబర్‌లో బిడ్డకు స్వాగతం పలకనున్నారని నెట్టింట చర్చ మొదలైంది. కత్రినా ప్రసవం తర్వాత సుదీర్ఘంగా విరామం తీసుకోవాలని యోచిస్తోందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ విషయంపై ఈ జంట ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

రెండు నెలల క్రితం కత్రినా కైఫ్ ఓవర్‌సైజ్ షర్ట్‌లో కనిపించడంతో మరోసారి ప్రెగ్నెన్సీ రూమర్స్ వినిపించాయి. ఆ పాత వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే తమపై వస్తున్న ప్రెగ్నెన్సీ వార్తలపై గతంలోనే విక్కీ కౌశల్ కూడా క్లారిటీ ఇచ్చారు. అలాంటిదేమీ లేదని.. ఏదైనా ఉంటే తామే స్వయంగా చెబుతామన్నారు. అంతేకాకుండా 'బ్యాడ్ న్యూజ్' ట్రైలర్ సమయంలో కూడా కత్రినా గర్భం ధరించారని రూమర్స్ వచ్చాయి. ఆ సమయంలో కూడా ఇలాంటి వార్తల్ని ఆయన ఖండించారు.

అయినప్పటికీ ఈ జంటపై పలు సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతూనే ఉన్నాయి. రెండు రోజుల క్రితమే కత్రినా తన కాస్మెటిక్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను షేర్ చేసింది. ఆ వీడియో చూసిన నెటిజన్స్ మరోసారి ఆమె గర్భవతి అంటూ కామెంట్స్ చేశారు. తాజాగా వస్తోన్న కథనాలపై కత్రినా, విక్కీ కౌశల్ క్లారిటీ ఇస్తే కానీ ప్రెగ్నెన్సీ రూమర్స్‌కు చెక్ పడేలా కనిపించడం లేదు.

మరోవైపు విక్కీ కౌశల్ ఈ ఏడాది ఛావాతో సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఏకంగా రూ.800 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా ఈ మూవీని తెరకెక్కించారు. విక్కీ ప్రస్తుతం రణబీర్ కపూర్, ఆలియా భట్‌తో కలిసి 'లవ్ అండ్ వార్' సినిమాలో నటిస్తున్నారు.

# ఆ నమ్మకంతో రిలీజ్ చేశాం.. హిట్ అయింది



సినిమాలు తీయడం అనేది జూదం లాంటిది. వస్తే భారీ లాభాలు. లేదంటే భారీ నష్టాలు. కొన్నిసార్లు మాత్రం ఊహించని సక్సెస్, కోట్ల కొద్దీ కలెక్షన్ వస్తుంటాయి. తాజాగా రిలీజైన సినిమాలు చూస్తుంటే అదే అనిపిస్తోంది. తెలుగులో 'లిటిల్ హార్ట్స్' ఎంతలా సంచలనం సృష్టిస్తుందో చూస్తునే ఉన్నాం. దీని కంటే ముందు రిలీజైన ఓ మలయాళ చిత్రం కూడా ఊహించని వసూళ్లతో రికార్డ్స్ బద్దలుకొడుతుంది. ఈ మూవీ గురించి హీరో కమ్ నిర్మాత దుల్కర్ సల్మాన్ ఆసక్తికర విషయాలు చెప్పాడు. 'నిర్మాతగా 'లోక' కోసం పెట్టిందంతా నష్టపోతానని అనుకున్నాను. స్టోరీ బాగా నచ్చింది. మంచి సినిమా అవుతుందని తెలుసు. కానీ బడ్జెట్ ఎక్కువైపోయింది. మలయాళంలో ఇంత బడ్జెట్ చాలా రిస్క్. కానీ కథని నమ్మి పెట్టాను. థియేటర్లలో రిలీజ్ చేద్దామంటే డిస్ట్రిబ్యూటర్స్ అంతగా ఆసక్తి చూపించలేదు. లోక ఫ్రాంచైజీ మొదలుపెడితే సీక్వెల్స్‌తో లాభాలొస్తాయని అనుకున్నాను. ఆ నమ్మకంతోనే రిలీజ్ చేశాం. కానీ ఈ సక్సెస్ మాత్రం ఊహించలేదు. మొదటిరోజు నుంచే సూపర్ హిట్ టాక్, భారీ కలెక్షన్‌తో సెన్సేషన్ సృష్టిస్తోంది. మా సంస్థకు భారీ లాభాలు తెచ్చిపెట్టింది' అని దుల్కర్.. లేటెస్ట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. మలయాళంలో వచ్చిన తొలి లేడీ సూపర్ హీరో సినిమా ఇది. తెలుగులోనూ దీన్ని 'కొత్త లోక' పేరుతో రిలీజ్ చేశారు గానీ ఇక్కడ ఓ మాదిరిగానే లాభపడింది. కల్యాణి ప్రియదర్శన్ లీడ్ రోల్ చేసిన ఈ చిత్రానికి డొమినిక్ అరుణ్ దర్శకుడు కాగా.. ఇందులో దుల్కర్ సల్మాన్, టొవినో థామస్, సౌబిన్ షాహిర్ తదితరులు అతిథి పాత్రల్లో కనిపించారు. థియేటర్లలోకి వచ్చి మూడు వారాలైనా సరే ఇప్పటికీ ఈ చిత్రానికి థియేటర్లలో రెస్పాన్స్ వస్తుండటం విశేషం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com